
www.vishvambhara.com
ప్రజా విశ్వంభర
తెలుగు దినపత్రిక
అక్షరం సాక్షిగా..
RNI No : TGTEL/25/A1676
శనివారం
15-08-2026
సంపుటి : 02 | సంచిక : 33 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




- యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పులు
- విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ ఇస్తున్నాం
- విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నాం
- ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం
- కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ
- ఏఐ వల్ల ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చింది
- ఈ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలి
- సాంకేతిక నైపుణ్యం సాధించిన వారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా పంపిస్తాం
- ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు అందిస్తాం:సీఎం రేవంత్ రెడ్డి
- హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పులే దంపతుల విగ్రహావిష్కరణ చేసిన రేవంత్ రెడ్డి



# విద్యావ్యవస్థ సమూల ప్రక్షాళన

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పులే విధానాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అన్నివర్గాలు ఒకేచోట చదువు, జీవించడం వల్ల కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. చదువుతో తలరాత మారి సమాజంలో గుర్తింపు లభిస్తుందని వివరించారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన జ్యోతిబా పులే, సావిత్రీబాయి పులే దంపతుల విగ్రహాలను రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా పాఠశాలల ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్?మెంట్ నిధులను ముందే క్రెడిట్ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచే దీన్ని అమలు చేస్తున్నామన్న ఆయన, కళాశాలల్లో అడ్మిషన్లు పొందాక ఆన్?లైన్?లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లోనే ఫీజు జమ అవుతుందని తెలిపారు. సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికే ప్రపంచం రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతోందన్న సీఎం, అలాంటి వారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధ వల్ల నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.

2లో



# గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్లు

- టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలి
- ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలి
- నిర్దేశిత గడువులోగా పుష్కరాల పనులు పూర్తి చేయాలి
- పుష్కరాల ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- "గోదావరి పుష్కరాలు-2027"పై కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఉమ్మడి 5 జిల్లాల్లోని 85 పుష్కర ఘాట్లు
- 22 ఆర్టీసీ బస్ స్టేషన్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి:మంత్రి పొన్నం ప్రభాకర్

2లో

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0



- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహణ
- ఈసారి ఇన్వెస్ట్ థీమ్‌తో సదస్సు నిర్వహణను మంత్రివర్గం ఆమోదం
- స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి
- వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్నాలకు రూ.500 బోనస్
- ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి
- 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్?లు
- 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలు ఈవీలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో పథకం
- ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి రూ.1.50 లక్షల సబ్సిడీ
- హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువు మరో 3 వారాలు పొడిగింపునకు నిర్ణయం
- మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనులకు రూ.2,100 కోట్లు
- కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించిన పొంగులేటి

2లో



# నా మాటలను వక్రీకరిస్తున్నారు

- దేశ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు
- కోర్టు వ్యాఖ్యలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆందోళన వ్యక్తం చేసిన సీజేఐ
- మీడియా బాధ్యతాయుతంగా వార్తలు అందించాలని సూచన

2లో

# సిందూర్ బలమైన సందేశం పంపింది



- సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో రైతులకు మేలు
- సత్యం, న్యాయాన్ని కాపాడటంలో భారత్ ఎప్పుడూ ముందుంటుంది
- ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయి
- దేశాన్ని నక్సల్ రహితంగా మార్చడం గొప్ప విజయం
- పబ్లిక్ పరీక్షల్లో అవకతవకల నివారణకు పెద్దఎత్తున సంస్కరణలు అమలు చేస్తున్నారు
- వికసిత్ భారత్ కోసం దేశప్రజలంతా పనిచేయాలి
- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి

2లో

# దేశంలోనే తెలంగాణ సైబర్ పోలీస్ బెస్ట్



- మొత్తం సైబర్ నేరాల్లో దాదాపు 60 శాతం పెట్టుబడి మోసాలే
- విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రజలు మోసపోతూనే ఉన్నారు
- 'డిజిటల్ అరెస్ట్' మోసాలను 70 శాతానికి పైగా విజయవంతంగా తగ్గించగలిగాం
- ప్రజల్లో మరింత అవగాహన పెంచడం పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం
- జాతీయ మీడియాతో డీజీపీ సీవీ ఆనంద్

2లో









# విద్యావ్యవస్థ సమూల ప్రక్షాళన

ఈ సంక్షోభాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలనే దానిపై అందరూ ఆలోచించాలన్నారు. అందుకే విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పిస్తున్నామన్నారు. సాంకేతిక నైపుణ్యం సాధించిన వారికి జర్మనీ, జపాన్, సౌత్? కొరియా పంపిస్తామన్నారు. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. జనగణన చేసి బలహీన వర్గాల లెక్క తేల్చిన తొలిరాష్ట్రంగా నిలిచి కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసిరామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలో లెక్కలు తెల్చి ఫిబ్రవరి 4న సోషల్? జస్టిస్ డేగా జరుపుకొంటున్నామన్నారు. కొందరు కులగణన, జలగననలో భాగస్వామ్యం కాలేదని కోర్టుకెక్కారన్నారు. అసెంబ్లీలో వ్యతిరేకించినా చట్టపరంగా కమిషన్ వేసి లెక్కలు తేల్చామని రేవంత్ రెడ్డి చెప్పారు. బలహీనవర్గాల లెక్కలు తేల్చిన రాష్ట్రం మనదే తొలి, చివరిదన్నారు. జనాభా లెక్కలు తేల్చాలంటే కులగణన చేయక తప్పని పరిస్థితి అన్న రేవంత్ రెడ్డి, ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన వంటివి ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనది అని వివరించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్?కు బాటలు వేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని రేవంత్ రెడ్డి వివరించారు. చదువులు, క్రీడలు, పరిపాలనలో రాణించాలని యువతకు పిలుపునిచ్చారు. పారదర్శక ప్రభుత్వాన్ని నడిపేందుకు సహకరించాలని కోరారు.

# దేశంలోనే తెలంగాణ సైబర్ పోలీస్ బెస్ట్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: సైబర్ నేరాలపై తెలంగాణ పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలపై డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ సైబర్ పోలీస్ బెస్ట్ అని కొనియాడారు. 'సురక్షా కా తిరంగా' ప్రచారంలో భాగంగా తెలంగాణ సైబర్‌క్రైమ్ బ్యూరో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షించిన జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో తెలంగాణ సైబర్‌క్రైమ్ విభాగం, జిల్లా యూనిట్లు అత్యుత్తమ పనితీరు కనబరిచి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయని వెల్లడించారు. సమాజంలో మాదకద్రవ్యాలు, కల్తీ ఆహారం, వ్యవస్థీకృత నేరాలతో పాటు సైబర్ నేరాలు కూడా పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల నిపుణులను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మొత్తం సైబర్ నేరాల్లో దాదాపు 60 శాతం పెట్టుబడి మోసాలే ఉంటున్నాయని, విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ ఫేక్ వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూపులు, నకిలీ ఫోన్ కాల్స్ నమ్మి ప్రజలు మోసపోతూనే ఉన్నారని డీజీపీ పేర్కొన్నారు. అయితే గత ఆరు నెలల నుంచి ఏడాది కాలంలో తీసుకున్న పటిష్ట చర్యల వల్ల 'డిజిటల్ అరెస్ట్' మోసాలను 70 శాతానికి పైగా విజయవంతంగా తగ్గించగలిగామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పెట్టుబడి మోసాలు, సెక్స్‌టార్షన్, ఓటీపీ, కేవైసీ ఫ్రాడ్స్ వంటి వాటిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడం పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని డీజీపీ వెల్లడించారు.

# గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్లు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన "గోదావరి పుష్కరాలు-2027"పై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, వివిధ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. నిర్దేశిత గడువులోగా పుష్కరాలకు సంబంధించిన పనులు పూర్తయ్యేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నాణ్యతలో అస్సలు రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. వర్క్ ప్రోగ్రెస్‌ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలన్నారు. అన్ని శాఖలు సమిష్టిగా పని చేస్తేనే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఇబ్బంది కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలని సూచించారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. కేబినెట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పుష్కరాల ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

**ఉమ్మడి జిల్లాల్లో 85 పుష్కర ఘాట్లు..**

గోదావరి పుష్కరాలకు సంబంధించి ఆర్టీసీ ప్రాథమిక కార్యాచరణ నివేదికను ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉమ్మడి 5 జిల్లాల్లోని 85 పుష్కర ఘాట్లు, వాటికి సమీపంలో ఉన్న 22 ఆర్టీసీ బస్ స్టేషన్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్ స్టేషన్లలో భవనాలు, ప్లాట్‌ఫారాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, రోడ్లు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. డిజాస్టర్ బోట్స్, రిస్క్ టీమ్స్, హైడ్రా లాంటి బృందాలు సమన్వయం చేసుకునేల ఏర్పాట్లు చేయాలన్నారు. ఒక్కో బస్ స్టేషన్ అభివృద్ధికి సుమారు రూ.3 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి, 22 బస్ స్టేషన్లకు మొత్తం రూ.66 కోట్లు అవసరం ఉందన్నారు. అలాగే తాత్కాలిక బస్ షెల్టర్లు, ప్రయాణికుల వేచి ఉండే ప్రాంతాలు, పార్కింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో ప్రాంతానికి సుమారు రూ.1 కోటి చొప్పున, 22 ప్రాంతాలకు మొత్తం రూ.22 కోట్లు అవసరమని అంచనా వేశారు. మహాలక్ష్మి పథకం అమల్లో ఉండటంతో ఆర్టీసీ బస్సులకు ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉందని, పుష్కరాల సమయంలో ఇంకా ఎక్కువ బస్సులు కావాలని కేబినెట్ సబ్ కమిటీ మీటింగ్‌లో ప్రతిపాదించారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి వీలైనన్ని ఎక్కువ బస్సులను నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

# నా మాటలను వక్రీకరిస్తున్నారు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: కోర్టు విచారణల సందర్భంగా చేసిన మౌఖిక వ్యాఖ్యలను సరైన సందర్భం లేకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను తప్పుగా ఉటంకించి, దురుద్దేశంతో దేశ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. 2026 మే 15న సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్? సూర్యకాంత్ యువతపై కీలక వ్యాఖ్యలు చేశారు. అవి తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా యువత నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. అనంతరం వ్యంగ్యంగా 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' అనే పేరుతో ఆన్‌లైన్ ఉద్యమం ప్రారంభించారు.

**మీడియా బాధ్యతాయుతంగా వార్తలు అందించాలి..**

అయితే, న్యాయపరమైన కార్యకలాపాలపై బాధ్యతాయుతంగా వార్తలు అందించాలని మీడియాకు సూచించారు. సమాజంలో సామరస్యాన్ని కాపాడటం ప్రతి పౌరుడి విధి అని అన్నారు. "మీరు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, మరే ఇతర మీడియాలో ఉన్నా లేదా కేవలం ఒక సాధారణ పౌరుడైనా, మనందరికీ హక్కులు, రాజ్యాంగబద్ధమైన విధులు, బాధ్యతలు ఉన్నాయి. మనం హక్కుల గురించి మాట్లాడినప్పుడు, వాటికి అనుగుణంగా బాధ్యతలను నిర్వర్తించే సామర్థ్యం కూడా మనకు ఉండాలి. సమాజంలో సామరస్యం నెలకొనేలా మనమందరం అవిశ్రాంతంగా కృషి చేయాలి" అని తెలిపారు.

**వాటిపై నిషేధం విధించాం..**

ఇదిలా ఉండగా, న్యాయపరమైన విచారణలో పారదర్శకత అవసరమని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. అందులో భాగంగానే సుప్రీంకోర్టు విచారణలను లైవ్ స్ట్రీమింగ్‌ను ప్రారంభించామని తెలిపారు. అయితే, సోషల్? మీడియాలో, ఇతర డిజిటల్? ప్లాట్?ఫామ్?లలో కోర్టు విచారణల ఆడియో, వీడియో రికార్డింగ్‌లను అనధికారికంగా వ్యాప్తి చేయడాన్ని నిషేధించిన విషయాన్ని గుర్తుచేశారు. న్యాయస్థానానికి సంబంధించిన వీడియోలను రీపోస్ట్ చేయడం, వాటి ద్వారా డబ్బు సంపాదించడాన్ని నిషేధిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశామన్నారు. "లైవ్‌స్ట్రీమింగ్‌ను దుర్వినియోగం చేయకూడదు. ముఖ్యంగా దాన్ని వాణిజ్యపరంగా దుర్వినియోగం చేయకూడదు. కొంతమంది ప్రజలు తమ వ్యక్తిగత లాభం కోసం చిన్న క్లిప్?లను దుర్వినియోగం చేస్తున్నారు. అది ఆగాలి" అని సీజేఐ అన్నారు.

**గతంలో ఓ సారి సీజేఐపై విమర్శలు..**

తన మాటలను వక్రీకరిస్తున్నారని గతంలోనూ ఒక సందర్భంలో జస్టిస్? సూర్యకాంత్ తెలిపారు. కోర్టు విచారణ సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో ఆయన వివరణ ఇచ్చారు. మీడియాలోని ఒక వర్గం తన మాటలను వక్రీకరించి ఆరోపించారు. దేశ యువతపై విమర్శలుగా తప్పుగా చిత్రీకరించిందంటూ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో లాయర్ వంటి వృత్తుల్లోకి ప్రవేశించిన వారినుద్దేశించే 'వ్యవస్థలపై బొద్దింకలు దాడి చేస్తున్నాయ'ని ప్రత్యేకంగా విమర్శించానని తెలిపారు. అయితే, 'అలాంటి వ్యక్తులే మీడియా, సోషల్ మీడియా, ఇతర వృత్తుల్లోకి చొరబడ్డారని, వారినే పరాన్నజీవులతో పోల్చాను' అని ఆయన పేర్కొన్నారు. కానీ, దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. భారత యువతను చూసి తాను గర్వపడుతున్నానని, వారే తనకు స్ఫూర్తి అని అన్నారు. అంతేకాదు, దేశాభివృద్ధికి దేశ యువతే మూలస్తంభాలని ఆయన చెప్పారు. సీజేఐ వ్యాఖ్య యువతలో తీవ్ర వ్యతిరేకతను రేకెత్తించింది. దీంతో 'కాక్రోచ్ జనతా పార్టీ'(సీజేపీ) అనే వ్యంగ్య ఆన్‌లైన్ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0




విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు.

ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు.

**మరికొన్ని కీలక నిర్ణయాలివీ..**

* వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది.
రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
* ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది.
* కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని ఈవీ (విద్యుత్తు వాహనాలు)గా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది.
* హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.
* మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# సిందూర్ బలమైన సందేశం పంపింది

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఉగ్రవాదులు, వారికి సహాయం చేసేవారు ఎక్కడ దాక్కున్నా సరే, వారి చర్యల ఫలితాలను అనుభవించక తప్పదనే బలమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ వారికి? పంపిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడమనేది దేశ ప్రయోజనాలకు, ముఖ్యంగా రైతుల ప్రయోజనాలకు ఒక నిర్ణయాత్మకమైన చర్య అని పేర్కొన్నారు. సత్యం, న్యాయాన్ని కాపాడటంలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని ముర్ము స్పష్టం చేశారు. ఈ మేరకు 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతిని శుక్రవారం రాత్రి ప్రసంగించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్? చేపట్టిన ఆపరేషన్? సిందూర్? గురించి ముర్ము ప్రస్తావించారు. ఆ సమయంలో భారత సాయుధ దళాలు కచ్చితత్వంతో వ్యవహరించగల సామర్థ్యాన్ని ప్రదర్శించిందని ఆమె కొనియాడారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చేవారికి ఇది ఒక స్పష్టమైన, గట్టి సందేశమని అన్నారు. ఉగ్రవాదానికి ఆశ్రయమిచ్చే దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం దేశ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా మన రైతులకు ఎంతో మేలు చేస్తుందని రాష్ట్రపతి చెప్పారు. పాక్?, సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా స్వస్తి చెప్పేంతవరకు ఈ ఒప్పందం నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. తన 16 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ భూమిలో 80 శాతానికి, మొత్తం నీటి వినియోగంలో 93 శాతానికి సింధు నదిపైనే ఎక్కువగా ఆధారపడిన పాకిస్థాన్‌కు ఈ నిర్ణయం గట్టి దెబ్బ అని చెప్పవచ్చు.

'వికసిత్ భారత్ కోసం దేశప్రజలంతా పనిచేయాలి..

వికసిత్ భారత్ లక్ష్యసాధన కోసం దేశప్రజలంతా పనిచేయాలని ముర్ము పిలుపునిచ్చారు. ఆమె సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. దేశంలో ఇప్పటికే 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేసినట్లు పేర్కొన్న రాష్ట్రపతి కొత్తగా మరో 3కోట్ల మందిని లక్షాధికారులను చేయాలనే లక్ష్యం దిశగా పయనిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయని రాష్ట్రపతి గుర్తు చేశారు. దేశాన్ని నక్సల్ రహితంగా మార్చడం గొప్ప విజయంగా అభివర్ణించారు. పబ్లిక్ పరీక్షల్లో అవకతవకల నివారణకు పెద్దఎత్తున సంస్కరణలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. మన విద్యార్థులే మన దేశ భవిష్యత్ నిర్మాతలని పేర్కొన్నారు. "మనం మన కలలను సాకారం చేసుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. భారత్‌ను అత్యుత్తమ దేశంగా తీర్చిదిద్దాలనే స్ఫూర్తితో పనిచేయాలి. అప్పుడే దేశ స్వాతంత్ర్యానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. నిబద్ధత గల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభివృద్ధికి బాటలువేసే శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యసేవల్లో ఉన్న డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు, శ్రమించే కార్మికులు, రైతులు అలుపెరగని కృషితో జాతి నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. క్రీడాకారులు, శిల్పులు, కళాకారులు, మార్గనిర్దేశంచేసే మేధావులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, ప్రజా సంక్షేమం కోసం అంకితమైన ప్రజాప్రతినిధులు, న్యాయవ్యవస్థకు సంబంధించిన సిబ్బంది, అంకితభావంతో పనిచేసే సివిల్ సర్వెంట్లు, ఆర్థికవ్యవస్థకు తోడ్పడే చిన్నాపెద్దా పెట్టుబడిదారులు, సామాజిక సేవకులు, స్వచ్ఛతా అభియాన్‌లో ముందుండే కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు దేశప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్నారు" అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. అలాగే, దేశంలో నక్సల్ ప్రభావం తగ్గడంపై ముర్ము ప్రస్తావించారు. "భారతదేశాన్ని నక్సల్ రహిత దేశంగా మార్చడం ఒక గొప్ప విజయం. ఒకప్పుడు నక్సలిజం బారిన పడిన ప్రాంతాల్లో నేడు ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఈ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతోంది" అని ఆమె తెలిపారు. "జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: పోలీసు ఉద్యోగార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి రెండేళ్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఐదేళ్ల వయోపరిమితిని పెంచినా యువత నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగార్థులకు శుభవార్త చెప్పింది. యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి రెండేళ్లు పెంచింది. పోలీస్, ఫైర్, జైళ్లు, ఎస్పీఎఫ్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్ట్ శాఖల పోస్టులకు వయోపరిమితి పెంచింది. ఇప్పటికే 2026 మే 18 నుంచి అమల్లో ఉన్న ఐదేళ్ల వయోపరిమితి పెంచారు. తాజాగా ఐదేళ్లకు అదనంగా మరో రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మొత్తం ఏడేళ్ల వరకు వయోపరిమితి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పోలీస్ రిక్రూట్‌మెంట్లకు ఈ వయోపరిమితి వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. నిరుద్యోగ యువత నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది.

**రాష్ట్రంలో కొలువుల సందడి..:** తెలంగాణ పోలీస్ శాఖలో కొలువుల సందడి మొదలైంది. 7,437 పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) ఇటీవల నోటిఫికేషన్లు జారీ చేసింది. పోలీస్, అగ్నిమాపక, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) శాఖలకు సంబంధించి వేర్వేరుగా 4 ప్రకటనలు వెలువడ్డాయి. వీటిలో ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు మొత్తంగా 7 వేలకు పైగా ఉన్నాయి. పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు మండలి వెబ్‌సైట్ ఋఋఋ.స్త్రజూతీవి.అఅ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు పీఎంటీ, పీఈటీ ప్రమాణాలు సరిగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే అప్లై చేసుకోవడం ఉత్తమం.

**ఆరోజు నుంచి అప్లై చేసుకోండి..:** ఆగస్టు 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని నియామక మండలి తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. దరఖాస్తులను అధికారిక వెబ్?సైట్? ద్వారా మాత్రమే స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎస్సై పోస్టులకు ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రూ.750 కాగా ఇతరులు రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది.

# ఉద్యమకారుల సేవలకు ఘన సత్కారం

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటిన సేవలకు ప్రశంస పత్రాలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారుల సేవలను గుర్తిస్తూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా సత్కరించారు. శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ, ఎల్బీనగర్ ఇన్‌చార్జి బీరెల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కంఠం సైదులుకు ప్రశంస పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాలు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో వారి పాత్రను ఈ సందర్భంగా కొనియాడారు. ఉద్యమం కోసం అహర్నిశలు శ్రమించిన వారిని గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర చంద్రశేఖర్ రెడ్డి, ఈ. అశోక్ కుమార్, కడిమల గోపాల్, బొమ్మకంటి శ్రీనివాస్, మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన చింతపట్ల రవీందర్, అనంత కుమార్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కోసం సాగిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, ఉద్యమకారుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు అన్నారు.



## గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు.. 6.360 కిలోలు స్వాధీనం



విశ్వంభర, సత్తుపల్లి: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం సత్తుపల్లి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.3,12,500 విలువైన 6 కిలోల 360 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి తరలించేందుకు ఉపయోగించిన ఐ10 కారు, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నుంచి సత్తుపల్లి మీదుగా హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఈగల్ టీమ్, పోలీస్ సిబ్బంది సత్తుపల్లి పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన ఐ10 కారును తనిఖీ చేశారు. కారులో 10 ప్యాకెట్లలో ఉంచిన 6 కిలోల 360 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో ఒడిశా రాష్ట్రం చండాక, పొట్టంగి, కొరాపుట్‌కు చెందిన కావూరి మారి, డ్రైవర్ కారా రాజేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐ10 కారు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ఎస్సై ప్రదీప్, ఈగల్ టీమ్ సభ్యులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ చేతుల మీదుగా ప్రశంస పత్రమును అందుకున్న ఉద్యకారుడు.



బంజారా తీజ్ ఉత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన వీ3 న్యూస్ ఛానల్, ప్రజా విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా.కాచం సత్యనారాయణ. ఈకార్యక్రమంలో బిబివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ నాము నాయక్, నిరోద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ధరావత్ మోతిలాల్ నాయక్ , ఎల్బీ జేఏసీఇస్లావత్ బాలాజీ, నునవత్ సుధాకర్, చంద్ర శేఖర్ లు పాల్గొన్నారు.

## ఏపూరి సోమన్న చట్టసభల్లో అడుగుపెడతాడు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరొకసారి సంచలన కామెంట్లు చేశారు. హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏండ్ల పాటల ప్రస్థానం పుస్తక ఆవిష్కరణ సభలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. అధికార పక్షంలో ఉన్నా ... ప్రతిపక్షంలో ఉన్నా తానెప్పుడూ ప్రజల పక్షమే అన్నారు. ఉన్నది ఉన్నట్లు మాట్లాడే నైజం నాది..దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిద్ధం కావాలి. అందుకు ఏపూరి సోమన్న లాంటి కళాకారులు గజ్జ కట్టాలి... నేను రుమాలు చూడతా... ప్రజల్లోకి వెళదాం అని రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మంచి చేస్తే మంచంట..తప్పు చేస్తే తప్పని అంటా అన్నారు. తెలంగాణ వచ్చాక కూడా పేదలకు న్యాయం జరగలేదు.. తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేనోళ్లు, కాంగ్రెస్ తో సంబంధం లేని వాళ్ళు...ఇవ్వాళ పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నారని ఆరోపించారు.ఇట్లాంటి వాళ్ళు పెద్ద పెద్ద పదవుల్లో ఉంటే బాధ అనిపిస్తుందని, రాష్ట్ర రాజకీయాలను మార్చే శక్తి, శాసించే శక్తి నాకుంది. నా నిజాయితీనే నా బలం అని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. రానున్న కాలంలో నిజాయితీపరులు, యువకులు అసెంబ్లీలో అడుగు పెట్టాలి..రాష్ట్ర రాజకీయాలు మార్పు దిశగా అడుగులు వేయాలని పిలుపు ఇచ్చారు. తెలంగాణ రాజకీయాలు కూడా తమిళనాడు తరహాలో మారనున్నాయని, తన వెంట ప్రజలు ఉన్నారు. అవినీతి ఎమ్మెల్యేలు డిపాజిట్ రాని ఎమ్మెల్యేలు, పాచిపోయిన ఎమ్మెల్యేలు తనకు అవసరం లేదని వ్యాఖ్యలు చేశారు. ఒకసారి గెలవగానే డబ్బు, అధికారం, పదవిపై వ్యామోహం పెరుగుతుంది. గెలిపించిన ప్రజలను గాలికి వదిలేస్తున్నారని, తాను నామినేషన్లకు డబ్బులు ఇస్తే ఎంపీ, ఎమ్మెల్యేలు అయినోళ్లు ఉన్నారని రాజగోపాల్ రెడ్డి అన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఎంపీలను, ఎమ్మెల్యేలను గెలిపించిన.. ఇప్పుడు వాళ్లను మనం పిలిస్తే వస్తారా... రారు. వాళ్ళు అధికారం ఎక్కడ ఉంటే అక్కడికే పోతారని ఆయన విమర్శించారు. తప్పుడు పనులు చేస్తూ కులాన్ని వాడుకోవడం మంచిది కాదని,అధర్మం, న్యాయం అన్ని కులాలకు ఒకటే ఉంటదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.ఇప్పుడున్న నాయకులు చాలామంది గెలిచే వరకు ఒక తీరుగా... గెలిచిన తెల్లారే మరో తీరుగా మారుతున్నారుని, అట్లాంటి వాళ్లకు తెల్లారేసరికి పెద్దపెద్ద కార్లు ఎట్లా వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఉన్నోడేమో 1000 రేట్లు పెరుగుతుండు... లేనోడు ఇంకా అక్కడే ఉంటుండు.. పైన ఉన్నోళ్లేమో లక్షల కోట్లు దోచుకుంటున్నారు.. పేదవానికి ఐదు లక్షల ఇల్లు ఇవ్వడానికి 500 రూల్స్ పెడుతున్నారని రాజగోపాల్ రెడ్డి మండి పడ్డారు. సగం ఇల్లు కట్టుకున్నాక... ఆటో ఉందనో ట్రాక్టర్ ఉందనో బిల్లులు ఆపేస్తున్నారని, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేద్దాం అన్నారు. అవసరం వచ్చినప్పుడు విద్యార్థుల కోసం, నిరుద్యోగుల కోసం, రైతుల కోసం, మహిళల కోసం, పోరాటం చేస్తా. ఇన్నేళ్లు సహనంతో ఉన్న... ఇక పోరాటం చేయాల్సిన అవసరం ఉందిని ఆయన అన్నారు. కళాకారులు చట్టసభల్లో అడుగు పెట్టాలి..తెలంగాణ రాష్ట్రం రావడంలో వాళ్ళు కూడా చాలా కీలకం..ఏపూరి సోమన్న ఏదో ఒక నియోజకవర్గ నుంచి చట్టసభల్లో అడుగుపెడతాడు. నేను మాటిస్తే వెనక్కి పోను అని రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు.



## తెలంగాణ పోలీసులకు కేంద్రం విశిష్ట పురస్కారాలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ తెలంగాణ పోలీసు,అగ్నిమాపక శాఖలను జాతీయ స్థాయి పురస్కారాలు వరించాయి. విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ, ధైర్యసాహసాలు ప్రదర్శించిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పతకాలను ప్రకటించింది. రాష్ట్రం నుంచి మొత్తం 18 మంది అధికారులు, సిబ్బంది ఈ గౌరవానికి ఎంపికయ్యారు. వీరిలో 16 మంది పోలీసు విభాగానికి చెందిన వారు కాగా, ఇద్దరు అగ్నిమాపక శాఖకు చెందిన వారు ఉన్నారు. విశిష్ట సేవలో.. పోలీసు శాఖలో సుదీర్ఘ కాలంగా విశిష్ట సేవలు అందిస్తున్న రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ ఆర్. జగదీశ్వర్ రెడ్డి, హైదరాబాద్ సిటీ, సికింద్రాబాద్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య జోగుల అత్యున్నతమైన ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ కు ఎంపికయ్యారు. వీరి అంకితభావం, నిబద్ధతను గుర్తిస్తూ కేంద్రం ఈ అత్యున్నత పురస్కారాలను ఖరారు చేసింది. ప్రాణాలకు తెగించిన గ్రేహౌండ్స్.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి పోరాడిన ముగ్గురు గ్రేహౌండ్స్ జవాన్లకు మెడల్ ఫర్ గ్యాలంట్రీ దక్కింది. బి. సత్యారావు, కె. సందీప్ కుమార్, జె. వంశీ కృష్ణలు అడవుల్లో జరిపిన సాహసోపేతమైన ఆపరేషన్లలో చూపిన శౌర్యానికి గుర్తింపుగా ఈ పతకాలు లభించాయి. మెరిటోరియస్ సర్వీస్‌లో పోలీసు అధికారులు.. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన 11 మంది పోలీసు అధికారులకు మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ దక్కింది. అదనపు డీసీపీ పి. వెంకటరమణ కరీంనగర్, ఏసీపీలు ఆర్.జి. శివ మారుతి, ఆశాల గంగారాం, డీఎస్పీలు బి. రవికుమార్ రెడ్డి, బచలకుర రమేష్, బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమాండెంట్ డి. సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ పి. జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుళ్లు సి. రాములు, కురపాటి తిరుపతి రాజు, గ్రేహౌండ్స్ హోంగార్డు మేడిపల్లి యాదయ్యలు ఈ జాబితాలో ఉన్నారు. అగ్నిమాపక శాఖకు రెండు పతకాలు.. తెలంగాణ అగ్నిమాపక శాఖలో అంకితభావంతో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందికి ఫైర్ సర్వీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ పురస్కారాలు లభించాయి. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ఫైర్ స్టేషన్‌కు చెందిన లీడింగ్ ఫైర్ ఫైటర్ ఎం. అశోక్, రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల ఫైర్ స్టేషన్‌కు చెందిన లీడింగ్ ఫైర్ ఫైటర్ టి. నరసింహ చారి ఈ గౌరవానికి ఎంపికయ్యారు. అధికారులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించడంపై తెలంగాణ పోలీసు,అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాలు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు.



## అధిక లాభాల పేరుతో రూ.3.45 కోట్ల మోసం.. వ్యక్తి అరెస్టు

విశ్వంభర, హైదరాబాద్: అధిక లాభాల ఆశ చూపి మోసగించిన కొండపల్లి గణేశ్ అనే వ్యక్తిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. మైహోమ్ భుజాలో గతంలో నిర్వహించిన వేలంలో గణపతి లడ్డూను గణేశ్ దక్కించుకున్నాడు. ఆ తర్వాత పరిచయాలతో బోయిన్‌పల్లి కిరణ్ అనే వ్యక్తితో కలిసి వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడ్డారు. దంపతుల నుంచి తొలుత రూ.31లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత తమ నుంచి రూ.3.45 కోట్లు వసూలు చేసినట్లు పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్టుబడి పెడితే నెలకు 6 శాతం లాభం ఇస్తామని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు గణేశ్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. అతడి ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలకు మళ్లించిన నిధులపై ఆరా తీస్తున్నారు. ఈ నిధులను విదేశాలకు తరలించారనే అనుమానాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఎల్పీజీ ఈ-కేవైసీ గడువు పెంపు!



విశ్వంభర, హైదరాబాద్: ఎల్పీజీ ఈ-కేవైసీ గడువు పెంచుతున్నట్లు గ్యాస్ కంపెనీలు నేరుగా వినియోగదారుల మొబైళ్లకు మెసేజ్‌లు పంపుతున్నాయి. ఈ నెల 23 వరకు గడువు పొడిగించినట్లు సమాచారం. సాంకేతిక సమస్యల కారణంగా గత రెండు రోజులుగా పలువురు వినియోగదారులకు ఈ-కేవైసీ పూర్తి కాలేదు. దీంతో చాలా మంది నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో కంపెనీలు గడువును పొడిగించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## యాదగిరిగుట్టలో 2వేల మందికి నిత్యాన్నదానం..

విశ్వంభర, యాదగిరిగుట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా పాలక మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మొత్తం 26 అంశాలకు ఆమోదం తెలిపింది. కొండపై దీక్షాపరుల, నిత్యకల్యాణ మండపాల ఏర్పాటు, మెట్ల మార్గంలో షెడ్లు, వేద పాఠశాల, గోశాల, రాయగిరి వద్ద భారీ కమాన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. రోజూ 2వేల మంది భక్తులకు అన్నదానం అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఆర్జిత సేవలు, నిత్య కైంకర్యాలకు టీసీఎస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సౌకర్యం కల్పించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. భక్తుల కోసం ప్రత్యేక సబ్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. కొండ చుట్టూ ప్రధాన కూడళ్ల వద్ద రాతి విగ్రహాల ఏర్పాటు, తులసి కాటేజీలో రెండు కల్యాణ కట్టల నిర్మాణానికి ట్రస్ట్ బోర్డు ఆమోదం ముద్ర వేసింది. దాతల కోసం కొండపై ప్రత్యేక కార్యాలయం, గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# డబుల్ బెడ్ రూమ్‌లపై సీఎం చర్చకు రావాలి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు ఎక్కడ నిర్మించిందని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్నారని.. రేవంత్ వెంటనే చర్చకు రావాలని.. తమ వెంట వస్తే తీసుకెళ్లి తాము నిర్మించిన ఇండ్లను చూపిస్తామని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సవాల్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొల్లూరు ప్రాంతంలో ఒకేచోట 16 వేల ఇండ్లను నిర్మించామని.. ఆసియా ఖండంలోనే అత్యధిక గృహ సముదాయం ఉన్న ప్రాంతం అని అన్నారు. తమ ప్రభుత్వం నిర్మించిన ఇండ్లకు విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, లిఫ్ట్ త్రాగునీరు వంటి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ 560 గజాల స్థలంలో అన్ని సౌకర్యాలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చారని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో 109 ప్రాంతాలలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టి వాటిలో 69 వేల ఇండ్లను అర్హులైన పేదలను పారదర్శకంగా అందజేసినట్లు వివరించారు. కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలలో తాము ఇండ్లు నిర్మించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఉచితంగా ఇండ్లు నిర్మించిన ఎక్కడ తమ పేర్లు పెట్టుకోలేదని, లబ్ధిదారుల వద్ద 6 లక్షల రూపాయలు తీసుకునే మీరు ఇందిరమ్మ ఇండ్లు అని పేరు పెట్టుకున్నారని విమర్శించారు. ఇండ్ల కోసం రూ.10 వేలు దరఖాస్తుతోపాటు చెల్లించాలని చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదలు చెల్లించిన డబ్బులు ఇంత వరకు రాలేదని అన్నారు. 22ఏను తీసుకొచ్చి పేదల భూములకు ఆంక్షలు పెట్టి ఇప్పుడు మీ భూమి మీకే ఇప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. పేద ప్రజల భూములు, ఇండ్లను 22ఏలో పెట్టే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. 22 ఏ ను అడ్డం పెట్టుకొని 30 నుండి 40 శాతం పర్సెంటేజీల దందా ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసన్నారు. త్వరలోనే వారి వివరాలు బయటకు వస్తాయని హెచ్చరించారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని.. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని తాము దేవుళ్లకు పూజలు చేస్తే.. క్షుద్ర పూజలు చేశారని సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడటం బాధాకరమన్నారు.



# తెలంగాణ ఉద్యమ అగ్నిపుత్రుడు

## త్యాగానికి ప్రతిరూపం.. ఉద్యమానికి ఊపిరి.. శ్రీకాంతాచారి

**మలిదశ తెలంగాణ స్వరాష్ట్ర పోరాట చరిత్రలో తన రక్తంతో "జై తెలంగాణ" అని రాసి, స్వరాష్ట్ర కాంక్షను ఢిల్లీ పీఠాన్ని కదిలించేలా చాటిచెప్పిన ఉద్యమకారుడు, మలిదశ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి. నవంబర్ 29, 2009న హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ చౌరస్తాలో తన శరీరాన్ని సమిధగా మార్చి, స్వరాష్ట్ర సాధన కోసం ఉప్పెనలా ఎగసిపడ్డ తెలంగాణ ఉద్యమానికి కాగడాగా మారిన ఆత్మబలిదానం శ్రీకాంతాచారిది.**




నెత్తురు చుక్క చిందకుండా, ప్రాణత్యాగం లేకుండాఏ ప్రజా ఉద్యమమూ విజయం సాధించిన ఆనవాళ్లు లేవని చరిత్ర చెబుతున్నది. ఎందరో అమర వీరులు తమ రక్తాన్ని ధారపోస్తే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. తొలి దశ ఉద్యమంలో 369 మంది ప్రాణాలు అర్పిస్తే, మలి దశ ఉద్యమంలో 1200 పైగా అమరులయ్యారు. మనం అమరుల భుజాల మీద నిలబడి ప్రత్యేక తెలంగాణ శ్వాస పీలుస్తున్నాం. మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్న తొలి ఉద్యమకారుడు శ్రీకాంతాచారి.3 డిసెంబర్ 2009 తెలంగాణ అంతటా విషాదఛాయలు. పాట మూగపోయింది, గజ్జె కునుకు తీసింది. భవిష్యత్తు తెలంగాణ యువ కిషోరం దివికేగి తెలంగాణఉద్యమానికివెలుగు దారి చూపింది. ఆ వీరుడిని గన్న తల్లిదండ్రుల దుఃఖాన్ని ఆపడం ఎవరి తరం కాలేదు. శ్రీకాంతాచారి రగిలించిన ఉద్యమ జ్వాలతో తెలంగాణ సమాజం నిప్పు కణికలా మారింది. యావత్ తెలంగాణ ప్రజానీకం ఒక్కటై స్వరాష్ట్రాన్ని సాధించుకునేందుకు ప్రతిన పూనింది. నేడు శ్రీకాంతాచారిభౌతికంగా లేకున్నా ఆ అమరుని త్యాగాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. నేడు శ్రీకాంతచారి జయంతి సందర్భంగా కథనం..

కాసోజు శ్రీకాంతాచారి నల్లగొండ జిల్లా (ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా) మోత్కూర్ మండలం పొడిచేడు గ్రామంలో 1986 సంవత్సరంలో స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు15) రోజున జన్మించాడు..ఆయన తండ్రి కాసోజు వెంకటాచారి, తల్లి శంకరమ్మ. సామాన్య విశ్వబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శ్రీకాంతాచారికి చిన్ననాటి నుంచే సామాజిక స్పృహ, తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాల పట్ల ఆవేదన మెండుగా ఉండేవి.శ్రీకాంతాచారి ప్రాథమిక విద్యను సొంత గ్రామంలో సమీప ప్రాంతాల్లో పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ఉన్నత విద్యను చదువుకున్నారు.2001లో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావంతో మలిదశ ఉద్యమం ఊపందుకుంది. హైదరాబాద్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే శ్రీకాంతాచారి ఉద్యమ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. విద్యార్థి విభాగం నాయకుడిగాఎల్‌బీ నగర్,దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యార్థులను ఏకం చేయడంలో శ్రీకాంతాచారి కీలక పాత్ర పోషించారు.తెలంగాణకుజరుగుతున్న నీళ్లు, నిధులు, నియామకాల అన్యాయాలను వివరిస్తూ తోటి విద్యార్థుల్లో స్వరాష్ట్ర కాంక్షను రగిల్చేవారు. రాస్తారోకోలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనల్లో ముందుండి నడిచారు. తెలంగాణ సాధన కోసం టీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) 2009 నవంబర్ 29న "ఆమరణ నిరాహార దీక్ష" చేపడుతున్నట్లు ప్రకటించారు. అయితే, ప్రభుత్వం కేసీఆర్‌ను కరీంనగర్ సమీపంలో అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించింది. ఈ వార్త తెలియాగానే తెలంగాణ వ్యాప్తంగా నిరసన జ్వాలలు ఎగసిపడ్డాయి.కేసీఆర్ అరెస్టును నిరసిస్తూ నవంబర్ 29 సాయంత్రం ఎల్‌బీ నగర్ చౌరస్తా వద్ద విద్యార్థులు, ఉద్యమకారులు భారీ ధర్నా చేపట్టారు. ఆందోళన తీవ్రరూపం దాల్చుతున్న సమయంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిమ్మకు నీరెత్తిన వైఖరిపై శ్రీకాంతాచారి తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. నా చావుతోనైనా తెలంగాణ సమా జం మేల్కోవాలి.. కేంద్ర ప్రభుత్వం దిగిరావాలి!" అని నినదిస్తూ, తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరంపై పోసుకొని నిప్పంటించుకున్నారు.అగ్నిజ్వాలల్లో కాలిపోతున్నా కూడా ఆయన "జై తెలంగాణ.. జై జై తెలంగాణ" అని బిగ్గరగా నినాదాలు చేస్తూ రోడ్డుపై పరుగులు తీసిన దృశ్యం ప్రతి తెలంగాణ వాసి గుండెలను పిండేసింది. తీవ్ర గాయాల పాలైన శ్రీకాంతాచారిని వెంటనే యశోద ఆసుపత్రికి తరలించారు. సుమారు 85 శాతానికి పైగా కాలిన గాయాలతో మృత్యువుతో పోరాడుతూ 2009 డిసెంబర్ 3న ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచి అమరుడయ్యారు. శ్రీకాంతాచారి ఆత్మబలిదానం తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన ప్రధాన ఘట్టంగా నిలిచింది. ఆయన త్యాగం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాన్నే కాక, ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వాన్ని కూడా షాక్‌కు గురిచేసింది. శ్రీకాంతాచారి బలిదానంతో విద్యార్థి లోకం అగ్నిపర్వతంలా ఉప్పొంగింది. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా మారాయి. ఆబాలగోపాలం రోడ్లపైకి వచ్చి పోరాటంలో భాగస్వాములైంది. ఉద్యమ తీవ్రతను, విద్యార్థుల ఆత్మబలిదానాలను గమనించిన అప్పటి కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 9, 2009న కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం ద్వారా "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నాం" అని చారిత్రాత్మక ప్రకటన చేయడానికి ఈ త్యాగమే ప్రధాన కారణమైంది. ఆతర్వాత తెలంగాణ వ్యాప్తంగా జరిగిన ప్రజా సంఘాల పోరాటాలు, రైల్ రోకోలు, సకలజనుల సమ్మె, సాగరహారం లాంటి పోరాట కార్యక్రమాల ఫలితంగా 2014 జూన్ 2 తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. కాసోజు శ్రీకాంతాచారి కేవలం ఒక వ్యక్తి కాదు..తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షకు ప్రతిరూపం. 23 ఏళ్ల చిన్న వయస్సులోనే ప్రాణాలను తృణప్రాణంగా త్యాగం చేసి, కోట్ల మంది తెలంగాణ ప్రజల స్వప్నాన్ని సాకారం చేయడానికి తన జీవితాన్ని బలిదానం చేసిన మహానీయుడు. ఆయన చిందించిన ప్రతి రక్తపు బొట్టు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాదిరాయిగా మారింది."అమరుడు శ్రీకాం తాచారి జోహార్" అనే నినాదం తెలంగాణ పోరాట చరిత్ర ఉన్నంత కాలం మార్మోగుతూనే ఉంటుంది. శ్రీకాంతచారిఆత్మబలిదానం స్వార్థం లేని త్యాగానికి నిలువెత్తు నిదర్శనం. ఒక యువకుడు తన భవిష్యత్తును, కలలను, ప్రాణాలను మాతృభూమి స్వేచ్ఛ కోసం త్యాగం చేయడం సామాన్యమైన విషయం కాదు. ఆయన ప్రాణ త్యాగం తెలంగాణ రాష్ట్ర సాకా రానికిపునాది రాళ్లలోప్రధానమైనది."అమరుడు శ్రీకాంతచారి" పేరుతెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు చిరస్మరణీయంగానిలిచిపోతుంది.ఆయనచూపిన ఉద్యమస్ఫూర్తితోనేప్రత్యేక తెలం గాణ కల సాకారమైంది.తెలంగాణ కోసం ఆసువులు బాసిన అమరులందరికీ యావత్ తెలంగాణ రుణపడి ఉంటుంది.నేడు శ్రీకాంత చారి జయంతి సందర్భంగా ఘన నివాళులర్పిస్తూ..

**డా.కాచం సత్యనారాయణ**
**తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు**

# సౌదీ-పాక్-టర్కీ కూటమితో భారత్‌కు దౌత్య హెచ్చరిక




ఆగస్టు 7న మక్కాలో సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య కుదిరిన ఉమ్మడి రక్షణ ఒప్పందం పశ్చిమాసియా--దక్షిణాసియా వ్యూహాత్మక సమీకరణాల్లో కొత్త సవాళ్లకు సంకేతం. ఒక దేశంపై సాయుధ దాడిని మిగతా రెండు దేశాలపై దాడిగా పరిగణించే సూత్రం ఇందులో కీలకం. భూ, సముద్ర, గగన, సైబర్ రంగాల్లో సహకారం, డ్రోన్లు, కృత్రిమ మేధ, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, రక్షణ సాంకేతికతలో సంయుక్త ప్రయత్నాలకు అవకాశం ఉంది. అయితే దీన్ని వెంటనే 'ఇస్లామిక్ నాటో'గా అభివర్ణించడం తొందరపాటే. ఒప్పందం అమలు విధానం, సైనిక బాధ్యతలు ఇంకా స్పష్టంగా లేవు. అయినా భారత్ దీని వెనుక ఉన్న వ్యూహాత్మక మార్పులను నిర్లక్ష్యం చేయలేం.

**మొదటి సవాలు..** పాకిస్థాన్‌కు పెరుగుతున్న దౌత్య విస్తృతి. చైనా, టర్కీ, సౌదీ అరేబియాలతో సంబంధాలను అనుసంధానించుకోవడం ద్వారా ఇస్లామాబాద్ తనకు ఉన్న భౌగోళిక, సైనిక ప్రాధాన్యాన్ని మరింత ఉపయోగించుకోవచ్చు. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించేందుకు కొత్త రాజకీయ వేదికలు లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా టర్కీ గత వైఖరి దృష్ట్యా, పాకిస్థాన్ ప్రచారానికి కొత్త బలం చేకూరకుండా భారత్ అప్రమత్తంగా ఉండాలి.

**రెండో సవాలు..** భారత పశ్చిమ సముద్ర భద్రత. అరేబియా సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఒమన్, ఎర్ర సముద్రం భారత వాణిజ్యానికి అత్యంత కీలకమైన సముద్ర మార్గాలు. పాకిస్థాన్ నౌకాదళ సామర్థ్యానికి టర్కీ డ్రోన్, నిఘా సాంకేతికత, సౌదీ ఆర్థిక వనరులు తోడైతే భవిష్యత్తులో సముద్ర నిఘా, మానవరహిత వ్యవస్థల వినియోగం పెరగవచ్చు. దీనికి ప్రతిస్పందనగా భారత నౌకాదళం, తీర నిఘా, డ్రోన్ వ్యతిరేక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సి ఉంటుంది.

**మూడో సవాలు..** ఇంధన భద్రత. గల్ఫ్‌లో ఏదైనా విస్తృత భద్రతా సంక్షోభం చమురు రవాణాను ప్రభావితం చేస్తే భారత్‌పై ప్రత్యక్ష ఆర్థిక ప్రభావం ఉంటుంది. చమురు ధరలు పెరగడం దిగుమతి బిల్లును, రవాణా వ్యయాన్ని, ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉంది. అందువల్ల గల్ఫ్ పరిణామాలు ఇక విదేశాంగ అంశం మాత్రమే కాదు; భారత ఆర్థిక భద్రతకు సంబంధించిన అంశం కూడా.


**నాలుగో సవాలు..**సౌదీతో సమతుల్యత. సౌదీ అరేబియాను పాకిస్థాన్ శిబిరంలోకి వెళ్లిపోయిన దేశంగా చూడటం పొరపాటు. భారత్–సౌదీ వాణిజ్యం 202425లో 41.88 బిలియన్ డాలర్లకు చేరింది. ఇంధనం, పెట్టుబడులు, రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక సహకారం, సాంకేతికత వంటి రంగాల్లో బంధం విస్తరించింది. ఈ ప్రయోజనాలను కాపాడుకుంటూనే సౌదీ–పాక్ రక్షణ సహకారం భారత ప్రయోజనాలకు వ్యతిరేకంగామలుపుతిరగకుండా నిరంతర ఉన్నతస్థాయిదౌత్య సంభాషణ అవసరం.

**ఐదో సవాలు..** గల్ఫ్‌లో ప్రభావ పోటీ. యూఏఈ, ఖతార్, ఒమన్, కువైట్, బహ్రెయిన్‌లను ఒకే దౌత్య సమూహంగా చూడకూడదు. ప్రతి దేశంతో ప్రత్యేక ఆర్థిక, ఇంధన, సాంకేతిక, భద్రతా భాగస్వా మ్యాలను బలోపేతం చేయాలి. అదే సమయంలో టర్కీతో సంభాషణ కొనసాగిస్తూ, పాకిస్థాన్‌కు అందుతున్న రక్షణ సాంకేతికతపై నిఘా పెంచాలి.భారత్ చాబహార్ ద్వారా మధ్య ఆసియా అనుసంధానాన్ని వేగవంతం చేయడం, వ్యూహాత్మక చమురు నిల్వలను పెంచడం, ఇంధన వనరులను విస్తరించడం, సముద్ర నిఘాను బలోపేతం చేయడం, గల్ఫ్‌లోని ప్రవాస భారతీయుల భద్రతకు ముం దస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం అత్యవసరం.మక్కా ఒప్పందం యుద్ధ పిలుపు కాకపోవచ్చు; కానీ భారత దౌత్యానికి స్పష్టమైన మేలుకొలుపు. పాకిస్థాన్ కొత్త మద్దతు వలయాలను నిర్మించుకుంటున్న వేళ భారత్ ఆవేశంతో కాకుండా ఆర్థిక బలం, సముద్ర శక్తి, ఇంధన భద్రత, సాంకేతిక సామర్థ్యం, గల్ఫ్ భాగస్వామ్యాలను సమన్వయపరిచి ముందుకు సాగాలి. మారుతున్న సమీకరణాల్లో భారత్‌కునిజమైన రక్షణ–బలమైన ఆర్థిక వ్యవస్థ, శక్తిమంతమైన రక్షణ సామర్థ్యం, చురుకైన దౌత్యం.

**- హెచ్ .ప్రతాప్, సీనియర్ పాత్రికేయులు ,హైదరాబాద్**

# స్వాతంత్ర్యం ఎవరికి వచ్చింది?

**1947 ఆగస్టు 15న బ్రిటిష్ వలస పాలన అంతమైంది. అది భారత ప్రజల చరిత్రలో ఒక మహత్తర ఘట్టం. లక్షలాది ప్రజల పోరాటాలు, వేలాది మంది అమరవీరుల త్యాగాలు, జైలు జీవితాలు, నిర్బంధాలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు సాగించిన అనేక ఉద్యమాల ఫలితంగానే బ్రిటిష్ పాలన అంతమైంది. ఆ త్యాగాలను గౌరవించడం మనందరి బాధ్యత.కానీ 79 సంవత్సరాల తర్వాత ఒక ప్రశ్నను తప్పించుకోలేం. బ్రిటిష్ వెళ్లిపోయారు. కానీ భారత ప్రజలు నిజంగా స్వతంత్రులయ్యారా?ఈ ప్రశ్నకు సమాధానం కోసం మనం నేటి భారతదేశాన్ని పరిశీలించాలి.**



1947లో విదేశీ పాలకులు వెళ్లిపోయిన తర్వాత భారతదేశం రాజకీయ స్వాతంత్ర్యం సాధించింది. రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి విలువలకు హామీ ఇచ్చింది. సార్వత్రిక ఓటుహక్కు వచ్చింది. పార్లమెంటు, శాసనసభలు, న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ ఏర్పడ్డాయి. ఇవన్నీ స్వాతంత్ర్య భారతదేశం సాధించిన చారిత్రక విజయాలే. అయితే రాజకీయ స్వాతంత్ర్యం ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యంగా పూర్తిగా మారిందా అనేది నేటి ప్రధాన ప్రశ్న.2026 జూలైలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత విద్యా వ్యవస్థలో అవకతవకలు, నీట్ పరీక్షకు సంబంధించిన ఆరోపణలు, పేపర్ లీకులు, తమ భవిష్యత్తుపై అనిశ్చితికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమాన్ని నిర్వహించారు. జూలై 20న పార్లమెంటు వైపు మార్చ్ చేయడానికి ప్రయత్నించిన సమయంలో పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ వంటి బలప్రయోగం చేశారు. పలువురు విద్యార్థులు గాయపడ్డారు. పోలీసుచర్య ఉద్యమాన్ని ఆపడం కంటే మరింత తీవ్రంగా ప్రజల దృష్టికి తీసుకువచ్చింది.ఇక్కడ అసలు ప్రశ్న విద్యార్థులు ఎవరి రాజకీయానికి మద్దతు ఇస్తున్నారు అన్నది కాదు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వారి మీద లాఠీలు ఎందుకు ప్రయోగించాల్సి వచ్చింది? పరీక్షల్లో అక్రమాలు జరిగాయా? పేపర్‌లీకులు జరిగాయా? నియామక వ్యవస్థలో అవకతవకలు ఉన్నాయా? ఉంటే బాధ్యులను శిక్షించాలి. విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలి. అదే ప్రజాస్వామిక పద్ధతి.కానీ ప్రశ్నించే విద్యార్థులపై లాఠీలు ప్రయోగించడం, టియర్ గ్యాస్ ఉపయోగించడం, నిరసనలను అణచివేయడానికి పోలీసు బలాన్ని ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత తీవ్రమైన హెచ్చరిక. ప్రజల సమస్యకు సమాధానం చెప్పలేని పాలక వ్యవస్థ ప్రజల గొంతును అణచివేయడానికి పోలీసు శక్తిని ఉప యోగించడం ప్రజాస్వామ్యానికి బలం కాదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థలో పెరుగుతున్న నిరంకుశ ధోరణికి సంకేతం.ఇది ఒక్క జంతర్ మంతర్ ప్రశ్న కాదు. ఇది భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న ప్రశ్న.జంతర్ మంతర్ ఘటన జరిగిన కొద్ది వారాలకే జార్ఖండ్‌లో ఉద్యోగార్థుల ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ప్రభుత్వ నియామక పరీక్షల్లో అవకతవకలపై దర్యాప్తు కోరుతూ వేలాది మంది యువత రాంచీలో ఆందో ళన చేశారు. ఆగస్టు 10న అసెంబ్లీ వైపు ర్యాలీ సందర్భంగా పోలీసులు వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్, లాఠీచార్జి ఉపయోగించారు. పోలీసులు, ఆందోళనకారులు గాయపడినట్లు నివేదికలు వెల్లడించాయి.ఇక్కడ కూడా ప్రశ్న అదే.ఉద్యోగం అడిగిన యువతను శత్రువులుగా ఎందుకు చూడాలి? పరీక్షల్లో అవకతవకలపై ప్రశ్నిస్తే ఎందుకు బారికేడ్లు? న్యాయం కోరితే ఎందుకు లాఠీలు? సమాధానం కోరితే ఎందుకు నిర్బంధాలు?ప్రజాస్వామ్యంలోప్రభుత్వ భవనాల చుట్టూ బారికేడ్లు ఉండవచ్చు. కానీ ప్రజల ప్రశ్నల చుట్టూ బారికేడ్లు ఉండకూడదు. పోలీసు లాఠీ ఒక విద్యార్థి ప్రశ్నకు సమాధానం కాదు. టియర్ గ్యాస్ ఒక నిరుద్యోగ యువకుడి భవిష్యత్తుకు పరిష్కారం కాదు. ప్రభుత్వం ప్రజలతో చర్చించాలి. వారి సమస్యలను పరిష్కరిం చాలి. నిరసనను అణచివేయడం ద్వారా నిరుద్యోగాన్ని, అవినీతిని, పరీక్షా వ్యవస్థ వైఫల్యాలను పరిష్కరించలేరు.1947లో బ్రిటిష్ పాలకులు వెళ్లిపోయారు. కానీ దేశ ఆర్థిక వ్యవస్థలో శ్రమించే ప్రజలకు సంపూర్ణ ఆర్థిక స్వాతంత్ర్యం రాలేదు.రైతు భూమిలో పంట పండిస్తాడు. కానీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, విద్యుత్, డీజిల్, రుణాల భారంతో నలుగుతాడు. పంటను ఉత్పత్తి చేసే రైతుకు ధరపై పూర్తి నియంత్రణ ఉండదు.కార్మికుడు పరిశ్రమను నడుపుతాడు. యంత్రాలను నడిపేది అతని శ్రమ. ఉత్పత్తిని సృష్టించేది అతని శ్రమ. కానీ శాశ్వత ఉద్యోగం, తగిన వేతనం, సామాజిక భద్రత మాత్రం అతనికి హామీగా ఉండవు.ఒకవైపుకార్మికుడి శ్రమ పెరుగుతుంది. మరోవైపు సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుంది. శ్రమించే వాడు పేదవాడిగానే ఉండి, శ్రమ ఫలితాన్ని స్వాధీనం చేసుకునేవాడు సంపన్నుడవుతుంటే ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కడుంది?ఇదే శ్రమదోపిడీయొక్కమూల వైరుధ్యం. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం పరిశ్రమలు, సాంకేతికత, మౌలిక వసతులు, ఉత్పత్తి రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించింది. కానీ అభివృద్ధి ఫలితాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరలేదు.

పెద్ద గుత్త పెట్టుబడిదారీ సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక రంగాలపై ఆధిపత్యాన్ని పెంచుకున్నాయి. సంపద కేంద్రీకృతమవుతోంది. రాజకీయ ప్రభావం కేంద్రీకృతమవుతోంది. మీడియా ప్రభావం కేంద్రీకృతమవుతోంది. ఆర్థిక నిర్ణయాలపై ప్రభావం కేంద్రీకృతమవుతోంది. ఇది కేవలం ధనికులు మరింత ధనికులు కావడం అనే సమస్య కాదు. సంపదతో పాటు అధికార ప్రభావం కూడా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్నప్పుడు ప్రజాస్వామ్యం యొక్క సామాజిక పునాది బలహీనపడుతుంది.2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 543 మంది ఎంపీలలో 504 మంది అంటే 93 శాతం మంది కోటీశ్వరులని ఏడిఆర్ విశ్లేషణ వెల్లడించింది. చట్టం ముందు అందరూ సమానమే. కానీ ఎన్నికల రాజకీయాల్లో డబ్బు శక్తి అందరికీ సమానంగా లేదు.పేద కార్మికుడికి ఓటు ఉంది. చిన్న రైతుకు ఓటు ఉంది. నిరుద్యోగ యువకుడికి ఓటు ఉంది. కానీ కోట్ల రూపాయలు ఖర్చు చేసే ఎన్నికల వ్యవస్థలో వారికి రాజకీయ అధికారాన్ని సాధించే అవకాశాలు ఎంతవరకు సమానంగా ఉన్నాయి?ఇదే పెట్టుబడి ప్రజాస్వామ్యం యొక్క అంతర్గత వైరుధ్యం.దేశ యువతకు స్వాతంత్ర్యం అంటే కేవలం జెండా ఎగురవేయడం కాదు. చదువుకు అవకాశం, ఉద్యోగానికి అవకాశం, గౌరవప్రదమైన జీవితం, తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అవకాశం వారికి కావాలి.2025 పిఎల్ఎఫ్ఎస్ ప్రకారం 15--29 సంవత్సరాల యువతలో నిరుద్యోగిత 9.9 శాతంగా ఉంది. పట్టణయువతలో అది 13.6 శాతానికి చేరింది. ఈ గణాంకాల వెనుక లక్షలాది కుటుంబాల ఆందోళన ఉంది.పరీక్షలకు సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న యువత వయస్సు దాటిపోతుంది. పరీక్షలు వాయిదా పడతాయి. నియామకాల్లో అవకతవకల ఆరోపణలు వస్తాయి. పేపర్ లీకుల ఆరోపణలు వస్తాయి. చివరకు నిరుద్యోగ యువత వీధుల్లోకి వస్తే ప్రభుత్వం వారితో మాట్లాడాలి. వారి చేతుల్లో లాఠీలు కాదు, వారి ప్రశ్నలకు సమాధానాలు ఉండాలి.ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల రోజున ఓటు వేయడం కాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, విమర్శించే హక్కు, నిరసించే హక్కు, సంఘటితమయ్యే హక్కు, తమ సమస్యల కోసం ఉద్యమించే హక్కు.ఈ హక్కులు లేకుండా ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ప్రజాస్వామ్యాన్ని సంపూర్ణం చేయదు.ప్రజా ఉద్యమాలపై కేసులు, అరెస్టులు, నిరసనలపై ఆంక్షలు, పోలీసు బలప్రయోగం వంటి చర్యలు సాధారణ పరిపాలనా పద్ధతులుగా మారితే అది అత్యంత ప్రమాదకర పరిణామం.నేడు విద్యార్థిపై ప్రయోగించిన లాఠీ రేపు కార్మికుడిపై పడవచ్చు. నేడు నిరుద్యోగ యువత గొంతును అణచిన అధికారం రేపు రైతు గొంతును అణచవచ్చు. అందుకే ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ ఏ ఒక్క వర్గానికి సంబంధించిన విషయం కాదు. అది ప్రజలందరి సమస్య.దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమయంలో ప్రజలను కులం, మతం పేరుతో విడదీసే రాజకీయాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి.రైతు హిందువైనా ముస్లింవైనా అతని సమస్య పంట ధర. కార్మికుడు ఏ కులానికి చెంది నవాడైనా అతని సమస్య వేతనం. నిరుద్యోగ యువకుడు ఏ మతానికి చెందిన వాడైనా అతని సమస్య ఉద్యోగం. పేద కుటుంబానికి చెందిన పిల్లవాడికి ఏ కులం ఉన్నా అతనికి కావలసింది నాణ్యమైన విద్య.అయితే ప్రజల నిజమైన సమస్యలను పక్కకు నెట్టి కులం, మతం పేరుతో ప్రజలను పరస్పరం విభజించడం వల్ల ఎవరు లాభపడుతున్నారు? ప్రజలు ఒకరినొకరు శత్రువులుగా చూసే పరిస్థితి ఏర్పడినప్పుడు, వారి శ్రమను దోచుకునే వ్యవస్థపై ప్రశ్నలు బలహీనపడతాయి.అందుకే కుల, మత విభజనలు కేవలం సామాజిక సమస్యలు కాదు. అవి ప్రజల ఐక్యతను దెబ్బ తీసే రాజకీయ ఆయుధాలుగా మారే ప్రమాదం ఉంది.కుల వివక్ష అంతం కావాలి. మత విద్వేషం అంతం కావాలి. మహిళలపై వివక్ష అంతం కావాలి. ఆదివాసీల భూమి, అడవి, వనరులపై దోపిడీ అంతం కావాలి. మనిషిని మనిషిగా కాకుండా కులం, మతం, సంపద ఆధారంగా కొలిచే ప్రతి వ్యవస్థను ప్రశ్నించాలి.బీజేపీ అధికారంలోకి వచ్చినా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, మరో పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల సమస్యలు కేవలం ప్రభుత్వ మార్పుతో పరిష్కారం కావు.ఎందుకంటే సమస్య కేవలం వ్యక్తులలో లేదు. సమస్య ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ఉంది. రాజకీయ అధికారాన్ని ఆర్థిక శక్తి ప్రభావితం చేస్తున్నంత కాలం ప్రజాస్వామ్యం అసంపూర్ణంగానే ఉంటుంది.అందుకే ఒక పార్టీని ఓడించడం మాత్రమే ప్రజల విముక్తికి పరిష్కారం కాదు. ప్రజలపై ఆధిపత్యం చెలాయిం చే ఆర్థిక, సామాజిక, రాజకీయ శక్తుల స్వభావాన్ని మార్చడం అవసరం.

1947లో మనం విదేశీ పాలన నుంచి రాజకీయ స్వాతంత్ర్యం సాధించాం. కానీ స్వాతంత్ర్య పోరాటం అక్కడితో ముగియలేదు.శ్రమ దోపిడీ ఉన్నంత కాలం పోరాటం అవసరం. కుల అసమానత ఉన్నంత కాలం పోరాటం అవసరం. మత విద్వేషం ఉన్నంత కాలం పోరాటం అవసరం. పేదరికం, నిరుద్యోగం, ఆకలి ఉన్నంత కాలం పోరాటం అవసరం. స్త్రీ--పురుష అసమానత ఉన్నంత కాలం పోరాటం అవసరం. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్నంత కాలం పోరాటం అవసరం. ప్రజాస్వామిక హక్కులు అణచివేయబడుతున్నంత కాలం పోరాటం అవసరం.అన్ని రకాల అసమానతలను రూపుమాపే సమానత్వ సమాజం కోసం ప్రజలు పోరాడాలి.ప్రజాస్వామ్యం అంటే ధనిక వర్గాలకు, గుత్త పెట్టుబడిదారులకు, అధికారాన్ని నియంత్రించే సంపన్న వర్గాలకు ఉపయోగపడే పెట్టుబడి ప్రజాస్వామ్యం కాదు.ప్రజాస్వామ్యం అంటే రైతుకు, కార్మికుడికి, విద్యార్థికి, మహిళకు, దళితుడికి, ఆదివాసీకి, నిరుద్యోగ యువతకు – ప్రతి శ్రమజీవికి ఉపయోగపడే ప్రజల ప్రజాస్వామ్యం కావాలి.ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఆర్థిక నిర్ణయాలపై ప్రజలకు నియంత్రణ ఉండాలి. శ్రమించే వర్గాలకు రాజకీయ అధికారంలో నిజమైన భాగస్వామ్యం మాత్రమే కాదు, శ్రామిక వర్గాల అధికారం ఏర్పడాలి.అప్పుడు మాత్రమే స్వాతంత్ర్యం కేవలం జెండాలో, రాజ్యాంగంలోని అక్షరాల్లో, ఎన్నికలలో కనిపించే రాజకీయ స్వేచ్ఛగా కాకుండా ప్రజల జీవితాల్లో అనుభవించే సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యంగా మారుతుంది. 1947లో విదేశీ పాలనను అంతం చేసిన అమరవీరులకు నిజమైన నివాళి వారి త్యాగాన్ని కేవలం స్మరించుకోవడం కాదు. దోపిడీ, అణచివేత, అసమానతలను అంతం చేసి సమానత్వం కోసం పోరాడటం. ధనిక వర్గాల ఆధిపత్య ప్రజాస్వామ్యానికి బదులుగా ప్రజల ప్రజాస్వామ్యాన్ని నిర్మించడం. శ్రమించే ప్రజల చేతుల్లో అధికారాన్ని నెలకొల్పడం.అదే సంపూర్ణ స్వాతంత్ర్యం వైపు మన ప్రయాణం.

**–నిర్మల్**




## మోదీ ప్రభుత్వ వైఫల్యాలతో దేశం సంక్షోభంలోకి వెళ్లింది : ఈ.టి. నరసింహ

**విశ్వంభర, అంబర్‌పేట :** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, వ్యవస్థల విధ్వంసానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిది రోజుల పాదయాత్ర శుక్రవారం అంబర్‌పేటలో ముగిసింది. శ్రీరమణ థియేటర్ నుంచి అలీ కేఫ్ చౌరస్తా వరకు నిర్వహించిన పాదయాత్రలో పార్టీ శ్రేణులు ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఈ.టి. నరసింహ మాట్లాడుతూ, ధరల పెరుగుదల, నిరుద్యోగం, అధిక పన్నులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని, వెంకటేష్ , స్టాలిన్, కమతం యాదగిరి, పల్లె నరసింహ, నదీమ్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## స్వా తంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



**విశ్వంభర, సూర్యాపేట:** స్వతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహ తో కలిసి పరిశీలించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించే పోలీస్ కవాతు రిహార్సల్స్ ను పరిశీలించారు. వేడుకలకు వచ్చే పౌరులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రజలు, పౌరులు, అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, ఆర్డిఓ వేణుమాధవ్, డిఇఓ అశోక్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే రామ్మోహన్ ప్రత్యేక పూజలు



**విశ్వంభర, పరిగి:** మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప కాలనీ లో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం లో అయ్యప్ప స్వామి ప్రాణ ప్రతిష్ట చేసి 41 రోజులు కావడం జరిగింది. నిత్యభిషేకం, గణపతి హోమం, ప్రభాత పూజ, మహా నైవేద్యం, అలంకార పూజ, దీపారాధన, ఉత్తర పూజ కార్యక్రమాలు, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం ధర్మకర్త పాలాది శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. స్వామివారి కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరికి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, మండల పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, రఘు మోహన్ రెడ్డి, బాదం శ్రీనివాస్ గుప్తా, తౌరియా నాయక్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## 17వ వార్డు అభివృద్ధికి కృషి : కౌన్సిలర్ శ్రీనివాస్ గుప్తా

**విశ్వంభర, పరిగి:** మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో పలు కాలనీలలో, పిఎసిఎస్ కార్యాలయం ఆవరణంలో స్థానిక కౌన్సిలర్ బాదం అఖిల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో డోజర్ సహాయంతో పిచ్చి మొక్కల తొలగించి రోడ్డు మరమ్మతులు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ అఖిల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆనంద్, యువజన కాంగ్రెస్ నాయకులు మీర్జా, తదితరులు పాల్గొన్నారు.



# 24 గంటల్లో జంట హత్యల కేసు ఛేదింపు

### సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు -- ఇద్దరి అరెస్ట్



**విశ్వంభర, సూర్యాపేట:** మోతే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన భార్యాభర్తల జంట హత్యల కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. మోతే గ్రామ శివారులో జాతీయ రహదారి 365బీ ఫ్లైఓవర్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో పాక్షికంగా పాతిపెట్టిన మృతదేహాలను గురువారం పోలీసులు గుర్తించారు. మృతులు మోతే మండలం బిక్య తండాకు చెందిన హలావత్ నాగులు, ఆయన భార్య హలావత్ బూబాగా గుర్తించారు. ఈ ఘటనపై కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సీసీటీవీ ఫుటేజీలో అనుమానాస్పదంగా కనిపించిన జిల్లేపల్లి సుందర్‌ను ఆధారంగా చేసుకుని దర్యాప్తు కొనసాగించారు. శుక్రవారం ఉదయం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద ఎం.డి. షరీఫ్, జిల్లేపల్లి సుందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. మృత దంపతులకు షరీఫ్ రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చినట్లు, డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినప్పుడు వారు బెదిరించడంతో వారిని హత్య చేయాలని పథకం పన్నినట్లు వెల్లడైంది. గొర్రెల రుణం పేరుతో నమ్మించి నాగులును మోతే శివారుకు తీసుకెళ్లి గుదిబండతో తలపై కొట్టి హత్య చేసినట్లు, అనంతరం బూబాను కూడా అదే ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. మహిళ వద్ద ఉన్న ఆభరణాలను కూడా నిందితులు తీసుకెళ్లినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన గుదిబండ, ఏ-1 షరీఫ్ బైక్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో సమర్థవంతంగా పనిచేసిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై లచ్చిరెడ్డి, సీసీఎస్ ఎస్సైలు సాయిరాం, హరికృష్ణతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# జాతీయ విద్యా విధానం అమలుకు సహకారం



**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** జాతీయ విద్యా విధానం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్ అన్నారు. శుక్రవారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ విద్యలో నాణ్యత పెంపుతో పాటు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకునే చర్యలకు తమ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తామని చెప్పారు. ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న 62 మంది విద్యార్థుల సమస్యను ముఖ్యమంత్రి జోక్యంతో పరిష్కరించినట్లు గుర్తు చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంకా అనుబంధ గుర్తింపు పొందని అర్హత కలిగిన కళాశాలలకు వెంటనే గుర్తింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో మార్పులకు సంబంధించి సమగ్ర అధ్యయనం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. విష్ణువర్ధన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు వీరరెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. శ్రావణ్ కుమార్, ఉమాశంకర్, సుధాకర్ రెడ్డి, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధిపై మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే మల్ రెడ్డి సమీక్ష



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో ఆదిభట్ల సర్కిల్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ఆక్రమణలు, సంక్షేమ పథకాల అమలు తీరు, పనుల పురోగతిపై అధికారులతో ఆయన ఆరా తీశారు. పట్టణాభివృద్ధిపై ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణను ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్న ఆయన... వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలు, నాలాల పూడికతీతను వేగవంతం చేయాలని చెప్పారు. దెబ్బతిన్న రోడ్లు, గుంతల మరమ్మతులను తక్షణమే పూర్తి చేసి, వీధి దీపాలు పనిచేయని ప్రాంతాల్లో వెంటనే ఏర్పాటు, మరమ్మతులు చేయాలన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆదిభట్ల, తుర్కయంజాల్ జోనల్ డీసీ సత్యనారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం కమిషనర్ సుదర్శన్ , టీపీవోలు, టీపీఎస్ లు, పారిశుద్ధ్య విభాగం ఇన్ స్పెక్టర్ వనజ, వార్డు ఆఫీసర్లు, ఏఈలు, డీఈలు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ సత్య ఇమిటేషన్ జ్యువలరీ ప్రారంభోత్సవం



**విశ్వంభర, ఉప్పుగూడ:** ఉప్పుగూడలో శ్రీ సత్య ఇమిటేషన్ జ్యువలరీ ప్రారంభోత్సవం జరిగింది ఆధునిక యుగంలో పెను మార్పు రావడం, పురుషులు, స్త్రీలు జువెలరీ పై మక్కువ చూపించడం వారి వారి అభిరుచికి తగ్గట్టుగా ఉప్పుగూడలో ప్రజలకు అందుబాటు ధరల్లో, అన్ని రకాల జువెలరీ అందిస్తున్నామని ప్రొప్రైటర్ అరవింద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్యక పరమేశ్వరి ట్రస్ట్ భవన్ ప్రధాన కార్యదర్శి సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, పి నాగేష్ గుప్తా దంపతులు, , నర్సా బాయ్, శోభ, కమలా బాయ్,, కుంచకూరి సతీష్ దంపతులు, కుంచకూరు సురేష్, శ్రీను, గుగ్గిళ్ళ సంతోష్ కుమార్, చాలిక్య శివకుమార్, మహేందర్, అశోక్, శ్రీకర్, కుమార్, ప్రసాద్, పి వేణుగోపాల్, తదితరులు పాల్గొని యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామపంచాయతీ సిబ్బందికి నూతన దుస్తులు పంపిణీ




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య సిబ్బందికి ఆ గ్రామ సర్పంచ్ గర్దాసు విక్రం నూతన దుస్తులు, అవసరమైన పారిశుధ్య సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని సర్పంచ్ గర్దాసు విక్రమ్ పేర్కొన్నారు. సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో రక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నూతన దుస్తులు, గ్లౌజులు, మాస్కులు తదితర సానిటరీ సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయసుధ స్వామి, పంచాయతీ కార్యదర్శి వీసం నరేందర్, వార్డు సభ్యులు కంబాలపల్లి సత్తయ్య, రాధారపు మహేశ్, వరికుప్పల స్వామి, నాగలక్ష్మి రాజు, కప్పల మంగమ్మ రాజు, పుట్టల లక్ష్మమ్మ ముత్యాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కైలాస్ నాగేష్‌ను పరామర్శించిన డాక్టర్ లక్ష్మణ్

**విశ్వంభర, చిక్కడపల్లి :** మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రైవేట్ సెక్రటరీ కైలాష్ నాగేష్‌ను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ శుక్రవారం హైదరాబాదు చిక్కడపల్లిలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా కైలాస్ నాగేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న డాక్టర్ లక్ష్మణ్ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. పూస రాజు, మాజీ కార్పొరేటర్ రవి చారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. పార్థసారథి, ఉపేందర్ రెడ్డి, ప్రభు గుప్త కైలాస్ నాగేష్‌కు ధైర్యం చెప్పారు.

## ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించైనా ఎమ్మెల్యే



**విశ్వంభర, పరిగి:** మున్సిపాలిటీ పరిధిలోని నజీరాబాద్ తండాలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని పరిగి ఎమ్మెల్యే తెలంగాణ పిసిసి ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, స్వామివారి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి మబ్బు మహేష్ ఆర్థిక సాయం



**విశ్వంభర, గుండాల:** గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెడ్డి రాజుల సోమయ్య కుటుంబాన్ని మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి రూ.5,016 ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మబ్బు మహేష్ తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రామ్ బాకీ, మందుల రాజు, బొర్ర యాకన్న, బాకీ గిరిబాబు, బొర్రా రాములు, మేడే యాదయ్యతో పాటు మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో బీజేపీ ఆద్వర్యంలో తిరంగా ర్యాలీ




**విశ్వంభర, రామన్నపేట:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో రామన్నపేట పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య, మండల ఇన్చార్జి కొరివి శంకర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, బిజెపి సీనియర్ నాయకులు దోగుపర్తి సుభాష్, గోపగోని ధర్మరాజు, మధ్యలపురి ఐలయ్య, జెల్లా లక్ష్మీనారాయణ, సిరిపురం గ్రామ ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష రమేష్, మండల ఉపాధ్యక్షులు బట్టే రమేష్, రేపాక లింగస్వామి, గన్నెబోయిన మధు తదితర బిజెపి నాయకులు, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లెక్చరర్స్, మదర్ తెరిసా హైస్కూల్, వివేకానంద హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జాతీయవాద ఐక్యతకి నిర్వచనంగా నిలిచారు.

## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి సన్మానం

**విశ్వంభర, పరిగి:** అమెరికాలో జరిగిన తెలుగు ఆట మహాసభలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వెళ్లి అక్కడ పది రోజులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పరిగిలో తన నివాసానికి విచ్చేసిన సందర్భంగా కౌన్సిలర్ ఎజాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగరాజ్ ,అనిల్, మీనాజ్, సల్మాన్, అజ్జు, సోహెబ్ తదితరులు పాల్గొన్నారు.





## మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన టీ-శాట్ సీఈఓ

విశ్వంభర, హైదరాబాద్: అమెరికా పర్యటన అనంతరం టీ-శాట్ సీఈఓ వేణు గోపాల్ రెడ్డి ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్‌కు సన్మానం



విశ్వంభర, కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడిగా చిలువేరు సమ్మయ్య గౌడ్ నియమితులైన సందర్భంగా కేజీకేఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మయ్య గౌడ్ గతంలో ప్రజాసేవలో చురుకుగా పాల్గొంటూ పేదలకు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేజీకేఎస్ మండల అధ్యక్షుడు బబ్బూరి ఉప్పలయ్య, కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, పలువురు సొసైటీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాహత్ ఖానం, అధ్యయన కేంద్ర సమన్వయ అధికారి డాక్టర్ జె.చిన్న బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా దానికి సమానమైన ఓపెన్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారు ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీలో చేరేందుకు అర్హులని వారు తెలిపారు. రెగ్యులర్‌గా కళాశాలకు హాజరు కాలేక చదువును మధ్యలో నిలిపివేసిన వారు, ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు తమ విద్యను కొనసాగించేందుకు ఇది ఒక చక్కటి అవకాశమని అన్నారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, ఇతర విద్యార్హత ధ్రువపత్రాలతో యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని, రామన్నపేట డిగ్రీ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలని, అనంతరం నిర్ణీత ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్లకు చివరి తేదీ సెప్టెంబర్ 9 అని తెలిపారు.

## మేడి సతీష్ రావుకు పితృ వియోగం



విశ్వంభర, పెద్ద శంకరంపేట: మెదక్ జిల్లా టిఆర్టియుటీఎస్ అధ్యక్షులు మేడి సతీష్ రావుకు వారి కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు గత శనివారం మేడి సతీష్ రావు తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శుక్రవారం ఆయన స్వగృహానికి వెళ్లి మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం సతీష్ రావుతో పాటు వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. పీఆర్టీయూ--టీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు మేడి సతీష్ రావు తండ్రి మరణం పట్ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ శ్రీపాల్ రెడ్డి , పీఆర్టీయూ--టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి , అధికార ప్రతినిధి శ్రీ వంగ మహేంద్ర రెడ్డి పిఆర్టియు టీఎస్ రాష్ట్ర,జిల్లా, మండల నాయకులు మరియు ఇతర నాయకులు విచ్చేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మేడి సతీష్ రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తండ్రిగారి మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆప్తుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారు అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ అపారమైన దుఃఖాన్ని భరించే మనోధైర్యం, ఆత్మస్థైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

# నేదునూర్ తెలంగాణ మోడల్ స్కూల్ లో అవగాహన ప్రోగ్రాం



విశ్వంభర, మహేశ్వరం : కందుకూరు మండలం నేదు నూర్ గ్రామంలో మోడల్ స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో కెనరా విద్యా జ్యోతి స్కీమ్ ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకుస్కాలర్‌షిప్‌లను అందజేసే కార్యక్రమం నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమానికి ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కందుకూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హెచ్. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లన సీఐ వెంకటేశ్వర్లు తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ బి. సైదా, జడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఎస్సై పరమేష్ అందజేశారు,ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హెచ్. వెంకటేశ్వర్లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసి వారికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు,అలాగే నేటి సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాలు, సైబర్ మోసాలు ఫ్రాడ్ కాల్స్ ఆన్లైన్ గేమ్స్ ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ తదితర సమస్యలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా ధైర్యంగా, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు, సమస్యలను ఎదుర్కొనే సమయంలో చట్టపరమైన మార్గాలను అనుసరించాలని, అవసరమైనప్పుడు పోలీసుల సహాయం తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కెనరా బ్యాంక్ ప్రతినిధులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇతరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి చేయూత పెన్షన్లు

### 31వ తేదీలోపు దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలి



విశ్వంభర, రామన్నపేట: నూతన చేయూత పెన్షన్లకు అర్హులైన వారి దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రామన్నపేట మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారి చేయూత పెన్షన్ దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే 16వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్ల నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ రాములు, ఎంపీవో రఫీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి పోలీసు పతకానికి ఎంపికైన జోగుల నరసయ్య



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, లక్ష్మాపురం గ్రామానికి చెందిన పోలీసు అధికారి జోగుల నరసయ్య ఉత్తమ సర్వీస్ అందించిన పోలీసులకి భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రపతి పోలీసు పతకానికి ఎంపికయ్యారు. 1991 బ్యాచ్ కు చెందిన ఈయన ఎస్సైగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలు పెట్టి, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం హైదరాబాద్ కమీషనరేట్ పరిధిలో ఈస్ట్ జోన్ అడిషనల్ డిసిపిగా విధులు నిర్వర్తిస్తున్నారు. జోగుల నరసయ్య ఈ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల ఆయన స్వగ్రామమైన లక్ష్మాపురం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంది ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసు అధికారుల జాబితాలో తెలంగాణ రాష్ట్రం నుండి జోగుల నరసయ్య ఎంపికయ్యారు. పోలీసు శాఖలో ఆయన అందించిన విశిష్ట సేవలు, విధి నిర్వహణలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా ఈ అరుదైన గౌరవం లభించినట్లు తెలిసింది. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని స్థానికులు పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణ, సేవాభావంతో ఎదిగి పోలీసు శాఖలో ఉన్నత స్థాయికి చేరుకోవడం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రపతి పోలీసు పతకానికి ఎంపిక కావడం లక్ష్మాపురం గ్రామానికే గర్వకారణమని గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పోలీసు అధికారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

# మహబూబాబాద్‌లో ఘనంగా 'తిరంగా ర్యాలీ

### 80 మీటర్ల జాతీయ జెండాతో హోరెత్తిన దేశభక్తి



విశ్వంభర, మహబూబాబాద్: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శుభసందర్భాన్ని పురస్కరించుకుని, అలాగే జాతీయ గీతం 'వందేమాతరం' 150 ఏళ్ల వైభవపూర్వక చరిత్ర స్ఫూర్తితో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో 'మహా తిరంగా ర్యాలీ' అత్యంత ఘనంగా, విజయవంతంగా నిర్వహించబడింది. ఈరోజు ఉదయం 10:00 గంటలకు ప్రారంభమైన ఈ భారీ ర్యాలీలో బీజేపీ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ న్యాయవాదులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సమరంలో వందేమాతరం గీతం దేశప్రజల్లో అభేద్యమైన దేశభక్తిని నింపిందని కొనియాడారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు ఈ తిరంగా ర్యాలీ అద్భుతంగా తోడ్పడిందని వారు పేర్కొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని, భారత్ మాతా కీ జై, వందేమాతరం నినాదాలతో న్యాయవాదులు ర్యాలీ పొడవునా ఉత్సాహంగా కదిలారు. దేశ సమగ్రతను, రాజ్యాంగ విలువలను కాపాడటంలో న్యాయవాద లోకం ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ దేశభక్తి కార్యక్రమంలో బీజేపీ లీగల్ సెల్ మహబూబాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ తుంపిళ్ల శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాదులు నలుసాని ప్రభాకర్ రెడ్డి, పుల్లఖండం శ్రీనివాస స్వామి, గాదె కమల్ కుమార్, డి. సత్యనారాయణ, పిన్ని రాము తదితరులు చురుగ్గా పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



విశ్వంభర, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ముఖ్య అతిథిగా నియమించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి ఉదయం 9:20 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 9:05 గంటలకు జిల్లా ఎస్పీ, 9:10 గంటలకు జిల్లా కలెక్టర్, 9:15 గంటలకు ముఖ్య అతిథి పెరేడ్ మైదానానికి చేరుకుంటారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన, పోలీస్ కవాతు నిర్వహించనున్నారు. 9:40 గంటలకు ముఖ్య అతిథి జిల్లా ప్రగతి సందేశాన్ని ఇవ్వనున్నారు. ఉదయం 10:05 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 10:40 గంటలకు స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, 10:45 గంటలకు వివిధ శాఖల ప్రగతి స్టాళ్లను సందర్శించే కార్యక్రమం ఉంటుంది. 11:15 గంటలకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాల ప్రదానం, అనంతరం జాతీయ గేయాలాపనతో కార్యక్రమం ముగియనుంది. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల్లో దేశభక్తి భావాలను పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.



## నడికుడలో నూతన ప్రెస్‌క్లబ్ ప్రారంభం

విశ్వంభర, హనుమకొండ: హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని నడికుడ మండల కేంద్రంలో నూతన ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మారుతి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిజం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నడికుడ మండలంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. నూతన కార్యవర్గం నిష్పక్షపాతంగా, ప్రజల పక్షాన నిలిచి పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కల్వల మోడల్ స్కూల్లో ఘనంగా తీజ్ పండుగ



విశ్వంభర, కేసముద్రం: కల్వల మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల కల్వలలో గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిమి నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాని ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధన, పంటల సమృద్ధి, సుఖసంతోషాలకు ప్రతీకగా తీజ్ పండుగను నిర్వహిస్తారని ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు, తీజ్ నృత్యాలతో అలరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ సోమయ్య ,వీరబాబు ,శ్రీదేవి అరుణా, హెల్త్ కేర్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్ రమ్య ,శ్వేత రేణుక కృష్ణ, నాయక్ పూర్ణ నాయక్, విద్యార్థిని ,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి బండారు దత్తాత్రేయ ప్రత్యేక పూజలు



విశ్వంభర, అంబర్‌పేట : హైదరాబాదు అంబర్‌పేట తిరుమలనగర్‌లోని శ్రీశ్రీశ్రీ అంబర్‌పేటరేణుక ఎల్లమ్మ దేవి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది చర్యలు చేపట్టాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్లు పులి జగన్, దుర్గాప్రసాద్ రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైహింద్ ఆధ్వర్యంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు జైహింద్ రామకృష్ణారెడ్డి, జయప్రకాశ్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, రజిత, లీల, మాలతి, మంజు, వల్లి, పవిత్ర పాల్గొన్నారు.

## ఎస్సైకు ఘనంగా వీడ్కోలు

విశ్వంభర, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సైల వీడ్కోలు, స్వాగత కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై గంగారపు కరుణాకర్‌కు వీడ్కోలు పలుకుతూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పి.నరేష్‌కు స్వాగతం పలికారు. సంఘం ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్‌కు తొలి ఎస్సైగా కరుణాకర్ విశేష సేవలందించారని కొనియాడారు. గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం కల్పించారని అన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో, స్థానిక సమస్యల పరిష్కారంలో ఆయన కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కరుణాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలు, ప్రజాప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. నూతన ఎస్సై నరేష్ మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, నేరరహిత మండలంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, యువకులు, వివిధ గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అభినందనీయం: అడ్వకేట్ శ్రీనివాస్

విశ్వంభర, కేసముద్రం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు వచ్చి సహకరించడం ఎంతో అభినందనీయమని కేసముద్రంకు చెందిన ప్రముఖ న్యాయవాది తుంపిల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కేసముద్రం మండల పరిధిలోని అమీనాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో పేద విద్యార్థులకు ఉచితంగా టీ-షర్టులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు తోడ్పాటునందిస్తూ మహబూబాబాద్ మోహన్ జిరాక్స్ యజమాని శ్రీ పసునూరి విద్యాసాగర్ ఈ టీ-షర్టులను సౌజన్యంగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అడ్వకేట్ తుంపిల్ల శ్రీనివాస్, అతిథి న్యాయవాది , ప్రధానోపాధ్యాయులు శ్రీ పత్తి వీరాస్వామి టి. లక్ష్మి, డాక్టర్ ఎస్. రాజు ,విద్యార్థులకు తమ చేతుల మీదుగా టీ-షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పత్తి వీరాస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులను ఆదుకోవాలనే ఉన్నత ఆశయంతో ముందుకు వచ్చిన దాత పసునూరి విద్యాసాగర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేసిన ముఖ్య అతిథులు తుంపిల్ల శ్రీని వాస్, పిన్ని రాము కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణీ

**విశ్వంభర, బోడుప్పల్:** మంద సంజీవరెడ్డి చొరవతో జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో మూడు లక్షల నిధులతో స్టేజి కోసం షెడ్డు నిర్మాణం అలాగే స్పోర్ట్స్ యూనిఫాంలు విద్యార్థులకు పంపిణీ చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సదర్ ల్యాండ్ గ్లోబల్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి చొరవతో తమ వంతు సామాజిక బాధ్యతగా నిరుపేద విద్యార్థులకు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా స్టేజ్ పైన రేకుల షెడ్డు నిర్మాణం, అదేవిధంగా విద్యార్థులకు ప్రత్యేకమైన స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంద సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ హాజరైనారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ సుమారు 3 లక్షలు నిధులు కేటాయించిన సదర్ ల్యాండ్ గ్లోబల్ హెల్త్ కేర్ సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో ఉత్తమ విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్త చక్రపాణి గౌడ్, శ్రీధర్ గౌడ్ మైసగళ్ళ శ్రీకాంత్, ఉప్పరి విజయ్, సదర్ ల్యాండ్ వైస్ ప్రెసిడెంట్ వీర రాఘవన్, శివ బాల శ్రీనివాస్, మారెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, పాఠశాల రిటైర్డ్ ఎడ్మాస్టర్ రవికుమార్, హెడ్మాస్టర్ అశోక్ కుమార్, ఉపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లను పంపిణీ చేశారు.

## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి




**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని కోరుతూ ఈనెల 31న ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహిస్తున్నామని భూ రక్షణ సమితి నేతలు తెలిపారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న 25 లక్షల ఎకరాల అసైన్డ్, సీలింగ్ , లవాని పట్టా భూములను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పక్కన ఉన్న తెలుగు రాష్ట్రంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు యాజమాన్య హక్కులు కల్పించాడని గుర్తు చేశారు. కెసిఆర్ బలహీన వర్గాల వద్ద ఉన్న ఈ భూములను లాక్కొని బిఆర్ఎస్ భవనాలు, స్మశాన వాటికలు ,రైతు వేదికలు నిర్మించి అన్యాయం చేశాడని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తన హామీని నెరవేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనుబంధ సంఘాల మద్దతుతో నిర్వహిస్తున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గో ప్రచార సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పీకే గుప్తా., భూ రక్షణ సమితి కోర్ కమిటీ సభ్యులు చల్లపల్లి లింగం, డాక్టర్ మల్లేష్, సిద్ధులు, మహిళా అధ్యక్షురాలు జీవజోతి, నల్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## దేశ విభజన విభీషికా స్మృతి దివస్: బాధితులకు బీజేపీ వినమ్ర నివాళులు




**విశ్వంభర, కేసముద్రం:** 1947 దేశ విభజన నాటి భయానక హింసలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు, బాధితులకు భారతీయ జనతా పార్టీ కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో వినమ్ర నివాళులు అర్పించారు. శుక్రవారం కేసముద్రంలో మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆధ్వర్యంలో 'దేశ విభజన విభీషికా స్మృతి దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ.. 1947లో జరిగిన దేశ విభజన మానవ చరిత్రలోనే అత్యంత ఘోరమైన క్రూరత్వానికి, విషాదానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు, స్వార్థ రాజకీయాల వల్లే అఖండ భారతావని ముక్కలైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ విభజన దారుణాల్లో ప్రాణాలు కోల్పోయిన కోట్లాది మంది అమాయక ప్రజలకు, మహిళలకు, పిల్లలకు బీజేపీ తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పేర్కొన్నారు. సొంత భూమిని, సంస్కృతిని, ఆస్తులను వదులుకుని శరణార్థులుగా మారిన కోట్లాది మంది ప్రజల వేదనను ఈ దేశం ఎప్పటికీ మరువదని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు అయిత సారయ్య, మండల జనరల్ సెక్రెటరీ బానోత్ రాము, ముఖ్య నాయకులు మంగిశెట్టి నాగయ్య, గుగులోత్ జీవన్, గణేష్, భూక్య ప్రవీణ్, భూక్య విజయ్, గుండు అయిలయ్య, గుండు సంతోష్, మాసాడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ మండలంలో వాహనాలను తనిఖీ

**విశ్వంభర,వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లావలిగొండ మండలంలోని వాహన తనిఖీ కార్యక్రమంలో భాగంగా వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్, ఏ. శ్రీకాంత్ రెడ్డి, నంబర్ ప్లేటు లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయటం జరిగింది. అలాగే హెల్మెట్ మరియు ఇన్సూరెన్స్ లేని వాహనాల యజమానులకు జరిమానా విధించి ట్రాఫిక్ ప్రమాణాలను అందరూ విధిగా పాటించాలి అని సూచించారు. ట్రాఫిక్ ప్రమాణాలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.



## చేవెళ్లలో ఘనంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం




**విశ్వంభర, చేవెళ్ల:** దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటిచెప్పే "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు మున్నూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో సందడి చేశారు. జాతీయ జెండాలతో నిర్వహించిన కార్యక్రమం చేవెళ్లలో దేశభక్తి స్ఫూర్తిని చాటింది. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ.. తిరంగా భారతదేశ స్వాతంత్ర్యం, గౌరవం, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ భావనలను పెంపొందించడం అవసరమని నాయకులు పేర్కొన్నారు. "హర్ ఘర్ తిరంగా" వంటి కార్యక్రమాలు యువతలో దేశం పట్ల గౌరవం, దేశసేవ పట్ల బాధ్యతను మరింత పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి మరియు శ్రీశైలం యాదవ్ బీజేఎం రాష్ట్ర నాయకులు వైభవ్ రెడ్డి , రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు పడమటి మమతా మోహన్ రెడ్డి, చేవెళ్ల కౌన్సిలర్స్ అత్తెల్లి మనీష్, అనంత్ రెడ్డి, మీనాక్షి సత్యనారాయణ, పెద్దోళ్ల దయాకర్, ఆలూర్ సర్పంచ్ భాగ్య శేఖర్ నాన్చేరు సర్పంచ్ అశోక్ బీజేపీ సీనియర్ నాయకులు అంజనేయులు, కుంచం శ్రీనివాస్, శర్వలింగం, మాణిక్య రెడ్డి, కుమార్ గౌడ్ వెంకట్రాంరెడ్డి ఇంద్రసేన రెడ్డి అశోక్ వెంకట్ రెడ్డి అల్లాడ శ్రీనివాస్ రెడ్డి చేగురి ప్రవీణ్ రెడ్డి , పత్తి సత్యనారాయణ, శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డులో డ్రైనేజ్ పనులు ప్రారంభం



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండల కేంద్రంలో ని 13వ వార్డు లో 6 లక్షలతో గ్రామ పంచాయతీ నిధులతో నూతన అండర్ గ్రౌండ్ గ్రైనెజీ నిర్మాణ పనులు ప్రారంబించడం జరిగింది, ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ వార్డులో డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయము గ్రామ పంచాయతి దృషికి రావడముతో, డ్రైనేజి సమస్యను తొలగించుటకు గాను నూతనముగా అండర్ గ్రౌండ్ గ్రైనెజీ నిర్మాణ చేపట్టడము జరిగినదని, అధెవిధముగా మన గ్రామ అభివృద్ధిలో పారిశుద్ధ్యం అత్యంత ముఖ్యమైన అంశం, పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యవంతమైన గ్రామానికి పునాది, గ్రామంలో చెత్త నిర్వహణ, మురుగు నీటి పారుదల, పరిశుభ్రమైన వీధులు కాలువల నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు, మహేశ్వరం గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక మౌలిక వసతులు కల్పించుటకు కృషి చేస్తున్నామని,మన గ్రామాన్ని పరిశుభ్రమైన,ఆరోగ్యవంతమైన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయి స్వచ్ఛ గ్రామం, ఆరోగ్య గ్రామం అనే లక్ష్యంతో అందరం కలిసి కట్టుగా పనిచేసి ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్ జొరల రమేశ్ , వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం ,నాయకులు కర్రోల్ల చంద్రయ్య ముదిరాజ్ ,జాటోత్ హనుమంతు కాడమోని ప్రభాకర్ , సున్నం కృష్ణ ,పోల్కం కిష్టయ్య దుద్దు కృష్ణ ,మిద్దింటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25 న ఇందిరా పార్క్ వద్ద బీసీల మహా ధర్నా



**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కోటా కల్పించాలని కోరుతూ ఈనెల 25న ధర్నా ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాను చేపడుతున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ నేతలు కోలా జనార్ధన్, నాగుల శ్రీనివాస్ యాదవ్, పి సతీష్, నాగు, నగేష్, జోగేందర్ సింగ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యా ప్రైవేటీకరణతో 1996లో బీసీలు ఆనాటి పాలకుల హామీ మేరకు ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని సాధించుకున్నారని తెలిపారు. తదనంతరం వచ్చిన పాలకులు ప్రైవేటు కళాశాలలకు ఇష్టా రీతిన ఫీజులు పెంచుకునే అవకాశం కల్పిస్తూ బీసీ విద్యార్థుల చదువులకు ఫీజులను ఎగనాం పెడుతున్నారని ఆవేదన చెందారు. ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసే హక్కు ఏ పాలకులకు లేదని గుర్తు చేశారు. ఈ పథకం బీసీల హక్కుగా నొప్పి చెప్పారు. రద్దు చేయడం కాకుండా శాశ్వత పథకంగా దీనిని కొనసాగించి బీసీ విద్యార్థుల చదువుకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీ కోటా లేకుండా మహిళా బిల్లు తెస్తే భారీ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. బీసీ కోటా లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. ధర్నా చౌక్ లో జరిగే ధర్నాకు అన్ని సంఘాలు, పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం విగ్రహాలు నిర్మించడం, కుట్టు మిషన్లు పంచటం కాదని చెప్పారు. బీసీలు ఈ మహా ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## యోగ సాధన, ప్రాణాయామంతో ఆరోగ్యం



**విశ్వంభర, చిట్యాల :** అందరు యోగసాధన, ప్రాణాయామం చేయడం తో ఆరోగ్యం గా ఉండవచ్చని సంకల్ప క్రియ యోగ గురువు శ్రీ రఘు గురూజీ అన్నారు. చిట్యాల లో ఈనెల 6వ తేది నుండి శ్రీ దత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉచిత సంకల్ప క్రియా యోగా శిక్షణా కార్యక్రమం శనివారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యోగసాదకులనుద్దేశించి రఘు గురూజీ మాట్లాడుతూ ఆధునిక కాలం లో చాలా మందికి అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని వాటి పరిష్కారం కోసం అష్టకష్టాలు పడుతున్నారన్నారు. దైనందిన జీవితంలో మార్పులు తీసుకొచ్చేందుకు అనారోగ్య సమస్యలను తొలగించుకునేందుకు ఆసుపత్రుల చుట్టూ తిరగలేక మందులు వేసుకులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి మందులు లేకుండా ఆరోగ్యంగా ఉండాలంటే ఒక్కటే పరిష్కార మార్గమని అదే ఎలాంటి ఖర్చులేని యోగసాధనే అని అన్నారు. నిత్యం యోగసాధన, ప్రాణాయామం, ధ్యానంతో అమృతాహారం టి అనారోగ్యం దూరమై ఆరోగ్యం గా జీవించవచన్నారు. ప్రతి ఒక్కరు యోగసాధన, ప్రాణాయామం, ధ్యానం నిత్య జీవితం లో భాగం చేసుకుని అమృతహారంను తీసుకుంటికి ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం యోగ సాదకులతో గ్రూప్ ఫోటో దిగారు. లికార్యక్రమం లో యోగ శిక్షకుడు దన్నాద నాయుడు, బూరుగు కృష్ణయ్య, కంచర్ల ఈశ్వరయ్య, కాచం వెంకటేశ్వర్లు, మాస శ్రీనివాస్, రేగొండ వేణుమాధవ్, కాచం రమేష్, పాలాది రమేష్ కాచం జ్యోతి, పందిరి అర్చన, దాడి అరుణ, లక్ష్మి, అనిత పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు: డివైఎఫ్ఐ



**విశ్వంభర, రామన్నపేట:** యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని డివైఎఫ్ఐ రామన్నపేట మండల అధ్యక్షులు శానగొండ రాము పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కొమ్మాయిగూడెం గ్రామంలో నిర్వహించిన డివైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో యువతను మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవల వైపు అడుగులు వేయాలని సూచించారు. యువత ఎదుర్కొంటున్న ఉపాధి, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి తదితర సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన కోరారు. యువత సమస్యలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు క్రీడా మైదానాలు, యువజన కేంద్రాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. యువతే దేశ భవిష్యత్తు అని, సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని శానగొండ రాము అన్నారు. యువజన సమస్యల పరిష్కారం కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపడతామని తెలిపారు.




## మహాధర్నాను విజయవంతం చేయాలి

**విశ్వంభర, అక్కన్నపేట :** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ డిమాండ్ చేశారు. 2026 సంవత్సరానికి సంబంధించిన పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అక్కన్నపేట మండలం కేశవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా శశిధర్ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టిసారించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ బకాయిలు, డీఏ పెండింగ్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం పీఆర్టీయూటీఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని కోరారు. ఈ సందర్భంగా కేశవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పీఆర్టీయూటీఎస్ చేపట్టిన కార్యక్రమాలకు, సెప్టెంబరు 1న నిర్వహించే మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సంపత్‌రావు, సర్దార్, కిషన్ నాయక్, బాల్‌రెడ్డి, మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి గూడు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రాష్ట్రంలో పేద కుటుంబాలకు గూడు కల్పించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మానూర్ మండల పరిధిలోని బెల్లాపూర్ గ్రామంలో నిరుపేద లబ్ధిదారురాలు మెత్రి పరమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ శుభకార్యాని ఎమ్మెల్యేడాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డిలి ముఖ్య అతిథిగా హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన గృహంలో అడుగుపెట్టిన మెత్రి పరమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ"పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా నిరంతరం శ్రమిస్తాం." ఈ కార్యక్రమంలో దత్తు గొండ మాజీ ఎంపీటీసీ,పట్లోళ్ల వెంకట్ రెడ్డి,పీర్ గోండా,దిగంబర్ రెడ్డి,ఎ రాజు,బీర్ గొండ స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ మండల/గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాకాంబరీ దేవిగా కనకదుర్గమ్మ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**విశ్వంభర, చిట్యాల:** శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా చిట్యాల లోనే శ్రీశ్రీశ్రీ కనకదుర్గ దేవాలయంలో అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరణ జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం, గణపతి పూజ, మంటపారాధన, గోపూజ జరిపారు. మహిళలు విచ్చేసి అమ్మవారికి వడి బియ్యం పోశారు. ప్రభుత్వ విప్ వేములకు పూర్ణకుంభంతో స్వాగతం: ప్రభుత్వ విప్పు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మారగొని ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి కృపా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శ్రావణమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి పూనుకున్న ఆలయ చైర్మన్, డైరెక్టర్లను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ ఛైర్ పర్సన్ పందిరి గీత రమేష్, వైస్ ఛైర్ పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రధాన అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జడల చిన్నమల్లయ్య యాదవ్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, బెలిదే సత్యనారాయణ, ఆలయ అధికారి ఏనుగు నరసింహారెడ్డి తో పాటు పలువురు నాయకులు, భక్తులు, పట్టణ ప్రముఖులు, సేవకులు పాల్గొన్నారు.



## సుద్దాల విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

విశ్వంభర, గుండాల: గుండాల మండలం సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అగ్గి రాములు, గ్రామ సర్పంచ్ గడ్డమీది మహోదయ్, ఉపసర్పంచ్ కాశం నాగేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమతి, ఏఏపీసీ చైర్మన్ మలిపెద్ది ఉమా, ఉపాధ్యాయులు నాగేష్, రాఘవేందర్, వెంకన్న, ఉమారాణి, పీఈటీ గవ్వల అమరేందర్, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జనగణన సిబ్బందికి అటెండెన్స్ సర్టిఫికెట్లు



విశ్వంభర, గుండాల: 2026 జనగణన విధుల్లో భాగంగా విధులు నిర్వహించిన గణకులు, పర్యవేక్షకులకు హాజరు ధ్రువపత్రాలు అందజేయాలని కోరుతూ పీఆర్టీయూటీఎస్ గుండాల మండల నాయకులు శుక్రవారం గుండాల మండల రెవెన్యూ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జనగణన విధుల్లో పాల్గొన్న సిబ్బందికి హాజరు ధ్రువపత్రాలు అందజేయాల్సిన విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మండల రెవెన్యూ అధికారి సానుకూలంగా స్పందించి, సోమవారం సాయంత్రం లోగా అందరి హాజరు ధ్రువపత్రాల ప్రక్రియను పూర్తి చేసి అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వెంటనే సంబంధిత ప్రక్రియను ప్రారంభించారు. పీఆర్టీయూటీఎస్ నాయకుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడంపై నాయకులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ గుండ...

## డా. పాలు శంకర్‌కు 'ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్' పురస్కారం



విశ్వంభర , హుస్నాబాద్ : హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన డా. పాలు శంకర్ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడారంగంలో చేసిన విశేష కృషికి ప్రతిష్ఠాత్మక "ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026" పురస్కారాన్ని అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 14న హైదరాబాద్ కింగ్‌కోటిలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. "బెస్ట్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అచీవర్స్ అవార్డు" కేటగిరీలో డా. పాలు శంకర్‌కు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. తోటపల్లి గ్రామం నుంచి క్రీడారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన డా. పాలు శంకర్ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా టున్నారు. క్రీడలు, సేవా కార్యక్రమాల ద్వారా యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా డా. పాలు శంకర్ మాట్లాడుతూ తన కృషిని గుర్తించి ప్రతిష్ఠాత్మక అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యత పెంచిందని, భవిష్యత్తులో క్రీడారంగంతో పాటు సామాజిక సేవలో మరింతగా పనిచేసి ప్రజలకు, యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. డా. పాలు శంకర్‌కు అంతర్జాతీయ స్థాయి పురస్కారం లభించడంపై తోటపల్లి గ్రామస్థులు, క్రీడాకారులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ఎంసిసి ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ జెర్సీల ఆవిష్కరణ

విశ్వంభర, చింతపల్లి: ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంసిసి క్రికెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే నాలుగు జట్ల జెర్సీలను కర్మన్‌ఘాట్ ధాన్యాంజనేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిసి క్రికెట్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మోర వెంకటరమణ, ఉపాధ్యక్షులు ఎండి. జాఫర్, ప్రధాన కార్యదర్శి గోవిందు ప్రసాద్, సహాయ కార్యదర్శి గోవిందు శివ, శ్రీ వెంకటేశ్వర స్టీల్స్ టీమ్ ఫ్రాంచైజ్ గునుకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# గైరన్ తండా సమస్యలు పరిష్కరిస్తా

### నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: సిర్గాపూర్ మండలం వాంగ్ధల్ గైరన్ తండాకు రహదారి నిర్మాణంతో పాటు తండాలోని విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ ఉమాహారతితో కలిసి రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం తండాకు వెళ్లి బ్రిడ్జి, రహదారి నిర్మాణ పనులపై అధికారులతో చర్చించారు. గతంలో తండా రహదారి దుస్థితిని పరిశీలించానని, సాంకేతిక కారణాలతో జాప్యం జరిగిందని తెలిపారు. ఇక ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది నాటికి రహదారిని అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని దెబ్బతిన్న రహదారులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. తండాకు 10 విద్యుత్ స్తంభాలతో పాటు అవసరమైన సామగ్రి అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారి కోసం భూములు ఇచ్చిన రైతులను ఎమ్మెల్యే సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. రహదారి నిర్మాణానికి భూమిపూజ జరగడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రహదారి కల సాకారం చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, తండావాసులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలపై సీఎం సమాధానం చెప్పాలి

### నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: సంగారెడ్డి జిల్లాకు ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ముందు గత ఎన్నికల్లో నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు వివరించాలని కోరారు. రేషన్ కార్డుల మార్పు, యువతకు ఉద్యోగాలు, తడ్కల్ మండల ఏర్పాటు, నల్లవాగు ప్రాజెక్టుకు నిధులు, కల్యాణలక్ష్మి పథకం, మహిళలకు నెలకు రూ.2,500, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. అలాగే దళిత బంధు తరహా పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సభలు, సమావేశాలు నిర్వహించడం అభివృద్ధి కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన పాలన అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పెండింగ్ సమస్యలపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేసి, నిధులు కేటాయించాలని భూపాల్‌రెడ్డి కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలి: జిల్లా అధికారి షేక్ జాన్ షాహిద్



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా 108 అత్యవసర సేవలు, 102 అమ్మఒడి సేవలు, 1962 పశు సంచార వాహన సేవల జిల్లా అధికారి షేక్ జాన్ షాహిద్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మాకంగా చెప్పట్టిన ఈ పథకాలను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళందుకు కృషిచేస్తానని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 32 అత్యవసర 108 అంబులెన్సు సేవలు, 10 అమ్మఒడి సేవలు, 102 వాహన సేవలు మరియు 4 పశు సంచార వాహన 1962 సేవలు నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. శుక్రవారం షేక్ జాన్ షాహిద్ మరియు రాజబాబు, శ్రీహరి జిల్లాలో ఇబ్రహీంపట్నం సి హెచ్ సి ని సందర్శించారు, సిబ్బందికి తగు సలహాలు, సుచనలు ఇచ్చారు. అత్యవసర పరిస్థితి ఎక్కడ జరిగిన అప్రమత్తంగా ఉండాలని, వెంటనే స్పందించాలాని 108, 102 మరియు 1962 సిబ్బందికి తెలిపారు. సిబ్బంది పనితీరు బాగుందని కొనియాడారు ఈ కార్యక్రమంలో సిబ్బంది భాస్కర్ ,నవీన్ పాల్గొన్నారు.

## తిరంగా మన దేశ గౌరవానికి ప్రతీక : బిజెపి రాష్ట్ర నాయకులు వెన్న ఈశ్వరప్ప



విశ్వంభర, పరిగి: కుల్కచర్ల మండల బిజెపి అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర బిజెపి నాయకులు నిర్వహించారు. బిజెపి రాష్ట్ర నాయకులు, సేవా రత్న అవార్డు గ్రహీత వెన్న ఈశ్వరప్ప, జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు ప్రహల్లాద రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ.. తిరంగా మన దేశ గౌరవానికి ప్రతీక అని, ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తి నింపాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ దేశ ఐక్యత సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వెంకటయ్య గౌడ్, హరి కృష్ణ, మహిపాల్, జానకిరామ్, అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన



విశ్వంభర, మోతే: మోతే మండలం కొత్తగూడెం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. మోతే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పంచాయతీ భవనంతో గ్రామ ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గట్టికొప్పుల శేషిరెడ్డి, ఉపసర్పంచ్ దోతుల శాంతి, నాయకులు సాగర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మహాదేవపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా కటకం

మహాదేవపూర్, విశ్వంభర : కాంగ్రెస్ పార్టీ మహాదేవపూర్ మండల అధ్యక్షులుగా కటకం అశోక్ ఎన్నికైన సందర్భంగా ఎడపల్లి గ్రామ సర్పంచ్ మోతే నీలరాణి సాంబయ్య, పలు గ్రామాల సర్పంచ్ లు, వార్డ్ మెంబెర్స్ కార్య కర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మహాదేవపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కటకం అశోక్ కృషి చేస్తారని ఆకాంక్షించారు. కటకం అశోక్ నాయకత్వంలో మహాదేవపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని, పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలోనూ చురుకుగా పాల్గొనాలి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి




విశ్వంభర, పెద్ద శంకరంపేట: 'నాట్ మీ బట్ యూ' అనే నినాదం ప్రతి విద్యార్థిలో సేవా భావం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవా దృక్పథం పెంపొందుతాయని తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, మాదకద్రవ్యాల నిర్మూలన, ఆరోగ్యం, విద్యపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలిగా గ్లోరినా ఎన్నిక




విశ్వంభర , హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ మైనారిటీ కోఆప్షన్ (క్రిస్టియన్) సభ్యురాలిగా కాతా అలియాస్ మారుపాక గ్లోరినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో 14 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో ఆమె ఎన్నికైనట్లు మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ ప్రకటించారు. గత మే నెలలో మొత్తం నలుగురు కోఆప్షన్ సభ్యులకుగాను ముగ్గురిని ఎన్నుకోగా.. ఒక మైనారిటీ కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక వాయిదా పడింది. కౌన్సిలర్ల ఏకాభిప్రాయంతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కాతా గ్లోరినాను మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించి మద్దతు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్స...

## పెద్ద శంకరంపేటలో తిరంగా ర్యాలీ



విశ్వంభర, పెద్ద శంకరంపేట: మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేత పట్టుకొని పట్టణ పురవీధుల గుండా తిరంగా ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలో గాంధీ చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా న్యూ బస్టాండ్ లమీదుగా విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాను పట్టణ పురవీధుల మీద ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ.బిజేవైఎం అధ్యక్షులు బుగుడాల కృష్ణ.. బిజెపి నాయకులు అనిల్. సురేష్ సంస్కార్ విద్యాలయ కరస్పాండెంట్ సీతారామారావు అంజయ్య సుకుమారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత్ సహనాన్ని బలహీనత అనుకోవద్దు : అజిత్ దోవల్



విశ్వంభర, నేషనల్ బ్యూరో: భారత్ ఎల్లప్పుడూ శాంతిని కోరుకుంటుందని, కానీ దాన్ని ఎవరైనా చేతగానితనంగా భావిస్తే సహించేది లేదని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్? స్పష్టం చేశారు. అవసరమైతే శత్రువుల స్థావరాల్లోకి దూసుకెళ్లి మరీ దెబ్బకొట్టే సత్తా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే డాక్యుమెంటరీ సిరీస్ కోసం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అజిత్ దోవల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.పహల్గాం ఉగ్రదాడికి కారణమైన వారిని, ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా నాశనం చేయడమే ఆపరేషన్? సిందూర్ లక్ష్యమని అజిత్ దోవల్ పేర్కొన్నారు. దాదాపు 88 గంటల పాటు సాగిన పోరాటంలో భారత సైనికులు శత్రు మూకలను మట్టికరిపించిందని తెలిపారు. అయితే, ఆపరేషన్ సిందూర్?కు సంబంధించిన చారిత్రాత్మక సైనిక వ్యూహాలు, నిర్ణయాల వెనుక ఉన్న అసలు కథను ఈ డాక్యుమెంటరీ సిరీస్ ద్వారా తెలియజేయనున్నారు. ఆగస్టు 15న(శనివారం) రాత్రి 9 గంటలకు డిస్కవరీ ఛానెల్, డిస్కవరీ ప్లెస్‌లో ప్రసారం కానుంది.కాగా, ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడికి భారత్ గట్టి బదులిచ్చింది. గతేడాది మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. ఇరు దేశాల మధ్య దాదాపు 88 గంటల పాటు కొనసాగిన ఈ సైనిక ఉద్రిక్తత, మే 10 సాయంత్రం ఒక అవగాహనకు రావడంతో ముగిసింది.ఇదిలా ఉండగా, సింధు జలాల ఒప్పందంపై పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. సింధు జలాలపై ఆందోళన వ్యక్తం చేసే ముందు, ఉగ్రదాడుల్లో చిందించిన ప్రతి భారతీయుడి రక్తపు బొట్టుకు ఇస్లామాబాద్ సమాధానం చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి ఎం.జె. అక్బర్ వ్యాఖ్యానించారు.

రక్తం, నీరు కలిసి ప్రవహించవని పాక్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్‌కు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టూ తమకు రెడ్ లైనే అని షరీఫ్ గురువారం అన్నారు. తాము శాంతిని కోరుకుంటున్నామని, అయితే తమ సార్వభౌమాదికారానికి ముప్పు వాటిల్లితే మాత్రం చూస్తూ ఊరుకోమని వ్యాఖ్యానించారు. 2025లో భారత్‌తో జరిగిన ఘర్షణలో పాకిస్థాన్ పైచేయి సాధించిందని, భవిష్యత్తు లోనూ ఏవైనా దాడులకు దిగితే అంతకంటే గట్టిగా బుద్ధి చెబుతామని షరీఫ్ అన్నారు. ఇదిలా ఉండగా, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో చెలరేగిన హింస గురించి అక్బర్? తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ సొంత దేశంపైనే బాంబులు వేసుకునే ఏకైక దేశం పాకిస్థాన్ అని ఆరోపించారు. గడిచిన 24 గంటల్లోనే పాక్ తనపైనే(బలూచిస్థాన్)లో బాంబుల వర్షం కురిపించిందని దుయ్యబట్టారు. పాక్ దయనీత స్థితిలో ఉందని, అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. బలూచిస్థాన్‌లోని 80 శాతానికి పైగా ప్రాంతంపై ఇస్లామాబాద్‌కు నియంత్రణ లేదని ఆరోపించారు.


ఆ ప్రాంతంలో పాక్ సైన్యం జరిపిన దాడుల్లో చిన్న పిల్లలతో సహా 20 మందికి పైగా పౌరులు మరణించారని బలూచ్ మానవ హక్కుల కార్యకర్త జారా తెలిపిన వివరాలను అక్బర్ వెల్లడించారు.ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఒకవైపు ఖైబర్ పఖ్తుంక్వా, బలూచిస్థాన్, పీఓకేలో తీవ్ర అశాంతి పరిస్థితులు, మరోవైపు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉండటం వంటి తీవ్ర రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు నడుస్తున్నాయని అక్బర్? అన్నారు. అయితే, వీటన్నింటిని కప్పిపుచ్చుకో వడానికే షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నీటి వివాదాన్ని తెరపైకి తెచ్చారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## సమయ్ రైనాపై కేసులు కొట్టివేసిన సుప్రీంకోర్టు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో స్టాండప్ కమెడియన్ సమయ్ రైనాకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. అతడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లన్నింటినీ న్యాయస్థానం కొట్టివేసింది. సమయ్‌తో పాటు మరో నలుగురు ఇన్‌ఫ్లూయెన్సర్లపై నమోదైన కేసులనూ కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. దివ్యాంగుల మనసు నొప్పించేలా జోకులు వేయడంపై సమయ్ రైనాను గతంలో మందలించిన సర్వోన్నత న్యాయస్థానం.. వారికోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నిధులు సేకరించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం, ఆదేశాలను ఉల్లంఘించినట్లు గమనించిన న్యాయస్థానం గత నెలలో రూ. 3లక్షల జరిమానా విధించింది. మరోసారి తప్పు చేస్తే.. భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఈ మొత్తాన్ని రెండు వారాల్లోగా సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. తాజాగా ఇదే కేసును విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ జేవీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. సమయ్ రైనా సహా ఇతర ఇన్‌ఫ్లూయెన్సర్లకు గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను పాటించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకొని, వారిపై నమోదైన కేసులను కొట్టివేస్తున్నట్లు తెలిపింది.

## ఢిల్లీలో పలు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: స్వాతంత్ర్య దినోత్సవానికి ముందురోజు దేశరాజధాని ఢిల్లీ లో బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. దిల్లీ హైకోర్టు, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహా ఇతర ప్రాంతాలకు శుక్రవారం బెదిరింపు మెయిల్ వచ్చింది. ఖలిస్థాన్ పేరిట దీనిని పంపినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ హైకోర్టులో శనివారం మధ్యాహ్నం 2.11 గంటలకు బాంబు పేలుతుందని, ఆ తర్వాత దిగువ కోర్టుల్లో పేలుళ్లు జరుగుతాయని ఆ మెయిల్‌లో దుండగులు హెచ్చరించారు. ఖలిస్థానీ వేర్పాటువాద సభ్యులు ఇప్పటికే రాజధాని నగరానికి చేరుకున్నారని పేర్కొన్నారు. జామ్‌నగర్ హౌస్, ఝండేవాలన్ బిల్డింగ్, సాకేత్ ఆఫీస్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఆఫీస్, విమానాశ్రయం టర్మినల్-3, దిల్లీ మెట్రో, అంబాలాకు వెళ్లే రైళ్లు.. ఇలా పలు ప్రదేశాలను దుండగులు మెయిల్‌లో ప్రస్తావించారు.స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో దిల్లీలో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమల్లో ఉన్నాయి. ఈ బెదిరింపు మెయిల్ నేపథ్యంలో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తయ్యారు. అందులో చెప్పిన ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతానికి అనుమానాస్పదంగా ఏమీ గుర్తించలేదని అధికారిక వర్గాల సమాచారం.

# భూకంప బాధిత కొలంబియాకు అండగా భారత్

**కొలంబియాకు 20 మెట్రిక్ టన్నుల వైద్య, సహాయక సామగ్రి**

**బంగ్లాదేశ్ డీజిల్ అభ్యర్థనపైనా స్పందించిన భారత విదేశాంగ శాఖ**

**బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పలు దేశాలకు ఆహ్వానాలు**



విశ్వంభర, నేషనల్ బ్యూరో: విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్వహించిన తాజా మీడియా సమావేశంలో భారత్‌కు సంబంధించిన పలు కీలక అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై స్పష్టత ఇచ్చింది. కొలంబియాలో ఇటీవల సంభవించిన భారీ భూకంపం నేపథ్యంలో భారత్ 20 మెట్రిక్ టన్నుల సహాయక సామగ్రిని పంపినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. బంగ్లాదేశ్ అదనపు డీజిల్ కావాలని చేసిన అభ్యర్థనపైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. ఇండస్ వాటర్ ట్రీటీపై (సింధూ జలాల ఒప్పందం) భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని మరోసారి స్పష్టం చేశారు. ఇంకా ఏయే అంశాలపై మాట్లాడారో పూర్తి వివరాల్ని చూద్దాం.

కొద్ది రోజుల కిందట కొలంబియాలో సంభవించిన భూకంపంపై భారత్ తీవ్ర సానుభూతి వ్యక్తం చేసింది. భూకంపంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సంతాపం తెలిపారు. సహాయక చర్యల్లో భాగంగా వైద్య సామగ్రి, మెడికల్ పరికరాలు సహా మొత్తం 20 మెట్రిక్ టన్నుల మేర సహాయక సామగ్రిని ఆ దేశానికి పంపినట్లు వెల్లడించారు. ఇతర ఏ సహాయమైనా అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని జైస్వాల్ స్పష్టం చేశారు.

బంగ్లాదేశ్‌లో ఇంధన సంక్షోభం నేపథ్యంలో అదనంగా డీజిల్ కావాలని ఆ దేశం చేసిన విజ్ఞప్తిపై ఎంఈఏ స్పందించింది. భారత్, బంగ్లాదేశ్ మధ్య ఇప్పటికే డీజిల్ సరఫరా కొనసాగుతోందని తెలిపిన జైస్వాల్, అదనంగా కావాలని చేసిన అభ్యర్థనను భారత్ పరిశీలిస్తుందని స్పష్టం చేశారు. ముందుగా దేశీయ అవసరాలు, రిఫైనింగ్ సామర్థ్యం, దేశంలో అందుబాటులో ఉన్న డీజిల్ పరిమాణం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని తర్వాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎంఈఏ భారత వైఖరిని వెల్లడించింది.

**ఇండస్ వాటర్ ట్రీటీపై అదే మాట..**


సింధూ జలాల ఒప్పందం విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని కేంద్ర విదేశాంగ శాఖ మరోసారి ఉద్ఘాటించింది. ఇప్పటికే ఈ ఒప్పందంపై భారత ధోరణి గురించి పలుమార్లు వెల్లడించిందని, దీంట్లో ఎలాంటి మార్పు లేదని పేర్కొంది. పాకిస్థాన్ సరిహద్దు బయట ఉగ్రవాదాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించే వరకు దీని ఊసు ఎత్తొద్దని గతంలోనే భారత్ తేల్చిచెప్పింది.

## అది నాకు, విద్యార్థులకు మధ్య సమస్య.. మీ జోక్యం ఎందుకు?: సీజేఐ



విశ్వంభర, నేషనల్ బ్యూరో: నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. "రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు" అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. "ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వాళ్లెవరు..?" అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# తప్పు చేశా.. ఎవరూ ఆ రూట్‌లో అమెరికాకు వెళ్లొద్దు!



విశ్వంభర, నేషనల్ బ్యూరో: భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన 'డంకీ' మార్గాల్లో అమెరికా సహా ఇతర విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో డంకీరూట్‌లో మెక్సికోకు వెళ్లిన ఓ పంజాబ్ యువకుడి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏజెంట్ల మాటలు నమ్మి తాను మోసపోయానని.. ఎవరూ డంకీ మార్గంలో విదేశాలకు వెళ్లొద్దని అతడు చేతులు జోడించి వేడుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. సురక్షితంగా తీసుకువెళ్తామని నమ్మించి.. డంకీ మార్గంలో మెక్సికోకు తీసుకువెళ్లిన ఏజెంట్లు తనను బంధించారని ఆరోపించారు. వారి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించగా.. తనపై తీవ్రంగా దాడి చేశారన్నారు. మరో వ్యక్తి సాయంతో తాను తప్పించుకోగలిగానని.. తీవ్ర గాయాల కారణంగా నడవలేని స్థితిలో ఉన్నానని పేర్కొన్నారు. అలాంటి ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని భారతీయులకు సూచించారు. గురువారం పోస్ట్ చేసిన ఈ వీడియోలో అతడి పేరు, చిరునామా వంటి విషయాలను వెల్లడించలేదు.

**ఏమిటీ డంకీ రూట్?**

విదేశాలకు అక్రమంగా వెళ్లేందుకు అనుసరించే మార్గాన్నే 'డంకీ' రూట్‌గా వ్యవహరిస్తుంటారు. ఇది పంజాబీ వాడుక భాష నుంచి వచ్చింది. అంటే ఎటువంటి ప్రణాళిక లేకుండా ఒకచోట నుంచి మరోచోటకు వెళ్లడం. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, షిప్ కంటైనర్లు, వాహనాల్లో రహస్య కంపార్టుమెంట్లలో దేశ సరిహద్దులు దాటిస్తారు. ఇందుకోసం భారీ మొత్తంలో ఏజెంట్లు డబ్బులు వసూలు చేస్తారు. ప్రమాదకర పరిస్థితుల్లో అంతర్జాతీయ సరిహద్దులు దాటిం చుకుంటూ చట్టవిరుద్ధంగా ఓ దేశంలోకి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తారు.

యూరోపియన్ యూనియన్ ఇచ్చే షెంజెన్ టూరిస్టు వీసాతో ఈ పద్ధతి మొదలవుతుంది. దీనివల్ల 26 దేశాల్లో తిరిగేందుకు వీలుంటుంది. నకిలీ దస్త్రాలు లేదా వాహనాల్లో రహస్యంగా యూకే లేదా అమెరికా దేశాలకు వెళ్లేందుకు అక్కడి కన్సల్టెంట్ల సాయం తీసుకుంటారు. కొందరు భారతీయులు మాత్రం కెనడా, అమెరికా, యూకేలకు అక్రమంగా వెళ్లేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

## దెయ్యాల భయంతో.. హాస్టల్ నుంచి వెళ్లిపోయిన 608మంది విద్యార్థులు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: హాస్టల్‌లో దెయ్యాలు తిరుగుతున్నాయనే భయం తో ప్రభుత్వ బోర్డింగ్ హాస్టల్ నుంచి 608 మంది విద్యార్థులు వెళ్లిపోయారు. ఈ ఘటన మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో చోటుచేసుకుంది. డోమా ప్రభుత్వ బోర్డింగ్ హాస్టల్‌లో అర్ధరాత్రి సమయంలో విచిత్రమైన, భయానక శబ్దాలు వినిపిస్తున్నాయని కొంతమంది బాలికలు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌లో దెయ్యాలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయనే వార్తలు వ్యాపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వందలాది మంది విద్యార్థులు హాస్టల్‌ను విడిచి ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే, ఇది మానసిక ఆరోగ్య సమస్య అని హాస్టల్ యాజమాన్యం తెలిపింది. ఫిర్యాదు చేసిన బాలికలను మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించినట్లు పేర్కొంది. సదరు విద్యార్థినులు తీవ్రమైన హిస్టీరియా వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని వైద్యులు తెలిపినట్లు యాజమాన్యం వెల్లడించింది. వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపింది.


## 4 సెకన్ల పాటు.. విమానంలో నియంత్రించలేని స్థాయిలో సాంకేతిక సమస్య

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఇటీవల థాయ్‌లాండ్ నుంచి దిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానం మధ్యలో తీవ్ర కుదుపులకు లోనయ్యింది. దీంతో ఒక్కసారిగా 300 అడుగుల కిందకి పడిపోయింది. ఈ ఘటనపై ఎయిర్‌బస్ నిపుణులు దర్యాప్తు చేపట్టి కీలక విషయాలు వెల్లడించారు. ప్రయాణ సమయంలో 4 సెకన్ల పాటు విమానంలో నియంత్రించలేని స్థాయిలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని తెలిపారు. దీంతో పాటు వరుసగా మూడు హైడ్రాలిక్ వైఫల్యాలూ నమోదయ్యాయని చెప్పారు.ఆ నివేదిక ప్రకారం.. "విమానం సాధారణంగా మూడు వేర్వేరు హైడ్రాలిక్ వ్యవస్థలతో పనిచేస్తుంది. వాటిలో ఒకటి విఫలమైనా, మిగతావాటితో ల్యాండింగ్ గేర్‌లను నియంత్రించవచ్చు. ఈ ఘటనలో సెకను వ్యవధిలో ఒకేసారి మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు పాడవడంతో సమస్య తీవ్రమైంది. అనంతరం విమానాన్ని పైకి/కిందికి తీసుకురావడానికి సహాయపడే ఎలివేటర్ నియంత్రణలోనూ లోపం తలెత్తింది. అదే సమయంలో ఆటో పైలట్ మోడ్ డిస్‌కనెక్ట్ అవ్వడంతో ..కో-పైలట్ విమానాన్ని మాన్యువల్‌గా నియంత్రించారు. దీంతో విమానం వేగంగా కిందికి దూసుకెళ్లింది" అని తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో 137 మంది ప్రయాణికులు, ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారు.

## 'కరూర్' బాధితులకు ఉద్యోగాలు.. విజయ్‌కు సుప్రీంలో ఊరట

విశ్వంభర, నేషనల్ బ్యూరో: కరూర్ తొక్కిసలాట ఘటన బాధితులకు ఉద్యోగాల వ్యవహారానికి సంబంధించి విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నియామకాలు చెల్లవంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పిటిషన్‌దారులకు నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంటి పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరా ఇవ్వొద్దా? అని వ్యాజ్యదారులను ప్రశ్నించింది. "తొక్కిసలాట జరిగింది.. ప్రజలు చనిపోయారు. ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థిక పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాంటప్పుడు వారికి ఉద్యోగం ఇవ్వడాన్ని ప్రశ్నించడం సమంజసమేనా? ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేందుకు మీరెవరు? ఒకవేళ సంపాదించే ఇంటిపెద్ద ప్రమాదవశాత్తూ మరణిస్తే.. ఆ వ్యక్తి కుమార్తె లేదా కుమారుడికి ప్రభుత్వాలు ఉపాధి ఇవ్వకూడదా?" అని సుప్రీం ధర్మాసనం పిటిషన్‌దారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు విజయ్ సర్కారు ఉద్యోగాలు కల్పించడంపై మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై జులైలో విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఆ నియామకాలు చెల్లవని తీర్పునిచ్చింది. "ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు" అని నాడు హైకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. దీంతో హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించగా.. విజయ్ సర్కారుకు తాజాగా ఊరట లభించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. విజయ్ ఎన్నికల ప్రచారం నిమిత్తం టీవీకే పార్టీ ఏర్పాటు చేసిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్.. అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. అన్నట్లుగానే.. జులై 10వ తేదీన కరూర్‌లో పర్యటించి.. అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

# జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలు.. నోటిఫై చేసిన ప్రభుత్వం



విశ్వంభర, నేషనల్ బ్యూరో: హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, లద్దాఖ్‌లతో పాటు కొన్ని ప్రాంతాల్లో సెప్టెంబర్ 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుంది. ఈ క్రమంలోనే జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. వీటిలో కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు.ఈ ప్రాంతాలలో జనాభా గణన సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జరుగుతుంది. అంతకుముందే, ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (ఎస్‌ఈ) పోర్టల్‌ను, జనగణనకు సంబంధించి పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా.. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనగణన వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది.

**రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా రూపొందించిన ప్రశ్నలలో కొన్ని:**

- జన్మస్థలం, ప్రస్తుత నివాస స్థలం, వలసకు కారణం
- ప్రస్తుతం ఉన్న ప్రదేశంలో ఎంత కాలం నుంచి ఉంటున్నారు? ఎందుకు ఉంటున్నారు?
- వ్యక్తి వైవాహిక స్థితి.. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ, మాతృభాష, మాట్లాడగలిగే ఇతర భాషల వివరాలు
- అక్షరాస్యతతో పాటు... డిజిటల్ అక్షరాస్యత స్థితి
- ఆర్థిక కార్యకలాపాల వివరాలు
- ఉద్యోగం కోసం వెతుకుతుంటే... ఎలాంటి పనికోసం వెతుకుతున్నారనే విషయంపై స్పష్టత
- వివాహిత, వితంతువు, విడాకులు తీసుకున్న మహిళలకు సంబంధించి... పిల్లలతో సహా అన్ని వివరాల నమోదు
- కొవిడ్-19 వ్యాక్సినేషన్ చేయించుకున్న ప్రదేశం
- బ్యాంకు ఖాతాలు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలతో కలిపి... మొత్తం 40 అంశాలపై వివరాల సేకరణ


## భారత్‌కు రానున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. సెప్టెంబర్‌లో దిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత్ అధ్యక్షతన జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.అక్టోబర్ 2024లో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ అయ్యారు.

ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. గతేడాది బ్రెజిల్ వేదికగా ఈ సదస్సు జరగగా.. అనంతరం ఈ ఏడాది అధ్యక్ష బాధ్యతలను భారత్ స్వీకరించింది.బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. గతేడాది ఇండోనేసియా కూడా ఇందులో చేరింది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. ఇదిలా ఉంటే, రెండు నెలల క్రితం దిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ భారత్‌కు వచ్చిన సంగతి తెలిసిందే.

విశ్వంభర V3 NEWS

# సుప్రీంకోర్టులో ఆళ్ల పిటిషన్లు కొట్టివేత



విశ్వంభర, ఏపీ బ్యూరో: చంద్రబాబు, నారాయణకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. అమరావతి అసైన్డ్ భూముల ల్యాండ్ పూలింగ్‌పై పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. వైఎస్సార్సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం డిస్మిస్ చేసింది. రాజకీయ కారణాలతో ఇలాంటి అంశాలు లేవనెత్తుతున్నారని సీజేఐ అభిప్రాయపడ్డారు. అయితే అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకున్న తర్వాత పూలింగ్ చేశారని ఆళ్ల ఆరోపించారు. కొందరికి లబ్ధి చేకూర్చేందుకే ప్రణాళిక ప్రకారం కుట్ర పన్నారని వాదించారు. కావాల్సినవారికి ముందు చెప్పి ఆ తర్వాత పూలింగ్‌కు వెళ్లారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలోనే హైకోర్టు క్వాష్ చేసింది. హైకోర్టు క్వాష్ చేయడంతో సుప్రీంకోర్టును ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆశ్రయించారు. కానీ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఆళ్ల దాఖలు చేసిన రెండు పిటిషన్లను డిస్మిస్ చేసింది. రాజధాని అమరావతి అసైన్డ్ భూముల విషయంలో ఉల్లంఘనలు జరిగాయని, అక్రమాలకు వీలు కల్పిస్తూ 2016 ఫిబ్రవరి 17న రాష్ట్ర ప్రభుత్వం జీవో 41 జారీ చేసింది. అయితే, కొందరు వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేందుకే ఈ ఉత్తర్వులు తెచ్చారని, భూముల బదిలీ నిరోధక చట్టం ఉల్లంఘనలు జరిగాయని ఆరోపిస్తూ అప్పటి వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 2021 ఫిబ్రవరి 24న సీఐడీకి ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో చంద్రబాబు, నారాయణలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు 2021 మార్చి 19న హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం దర్యాప్తుపై నాలుగు వారాల పాటు స్టే ఇచ్చింది. ఆ తర్వాత సీఐడీ విచారణ ముమ్మరం చేస్తూ మాజీ మంత్రి నారాయణను నిందితుడిగా చేర్చింది. 2024 మార్చిలో విజయవాడ ఏసీబీ కోర్టులో చంద్రబాబును నిందితుడిగా పేర్కొంటూ సీఐడీ తుది ఛార్జిషీటును కూడా దాఖలు చేసింది. హైకోర్టు ఈ క్వాష్ పిటిషన్‌పై సుదీర్ఘంగా వాదనల తర్వాత, 2024 ఏప్రిల్‌లో తీర్పును రిజర్వ్ చేసింది. కేసులో ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ చంద్రబాబు, నారాయణపై ఉన్న కేసులను హైకోర్టు 2026 జులై 15న క్వాష్ చేసింది. దీంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి తగిన కారణాలు లేవని ధర్మాసనం స్పష్టం చేసింది.

# పరిధి దాటొద్దు..మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

వ్యక్తిగత దూషణలకు, బూతులకు వెళ్లొద్దని నేతలు, జనసైనికులకు ఆదేశం



విశ్వంభర, ఏపీ బ్యూరో: ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా వేదికలపై మాట్లాడేటప్పుడు జనసేన నాయకులు, కార్యకర్తలు తమ భాష విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎవరైనా సరే భాష, భావ వ్యక్తీకరణ విషయంలో తమ పరిధి దాటవద్దని ఆయన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ శ్రేణులు పాటించాల్సిన మార్గదర్శకాలపై జనసేన కేంద్ర కార్యాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. జనసేనకు మద్దతుగా ఉండే ఒక ప్రవాసాంధ్రుడు ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు రియాజ్‌పై ఆయన పలు ఆరోపణలు గుప్పించారు. దీనిపై రియాజ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఆరోపణలు చేసిన వ్యక్తిని ఉద్దేశించి సోషల్ మీడియాలో బూతు పదజాలం వాడారు. రియాజ్ తీరుపై జనసైనికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఈ తరహా వివాదాలకు వెంటనే చెక్ పెట్టేందుకు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం ఏమాత్రం సరికాదని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. టీవీ చర్చలు, సోషల్ మీడియాలో మాట్లాడేటప్పుడు పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. ఎవరూ కూడా ఇతరుల వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లొద్దని సూచించారు. వ్యక్తిగత దూషణలకు దిగొద్దని హెచ్చరించారు. పార్టీ సిద్ధాంతాలు, నిబంధనలకు అనుగుణంగానే నాయకులు స్పందించాలని స్పష్టం చేశారు. నాయకులు, జనసైనికులు అనవసర ఆవేశాలకు లోను కావద్దని పార్టీ సూచించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ అసభ్య పదజాలాన్ని వాడవద్దని ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ మహిళలను గౌరవిస్తూ మాట్లాడాలని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. పార్టీ అంతర్గత విషయాలను సోషల్ మీడియా వేదికగా రచ్చ చేయొద్దని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అలాగే జనసేన భావజాలాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే పార్టీ ఏమాత్రం ఉపేక్షించదని, క్రమశిక్షణా చర్యలు ఉంటాయని చెప్పారు. జనసైనికులను కావాలని రెచ్చగొట్టే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ ప్రత్యర్థులు పన్నే వలలో పడొద్దని కార్యకర్తలను అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా ప్రతి ఒక్కరి మాట, తీరు ఉండాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మరోవైపు పార్టీ కోసం నిస్వార్థంగా కష్టించి పనిచేసే ప్రతి జనసైనికుడికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. జనసైనికులు, వీర మహిళల సంక్షేమం ఎప్పుడూ అధ్యక్షుల వారి దృష్టిలో ఉంటుందని జనసేన కేంద్ర కార్యాలయం ఆ ప్రకటనలో వివరించింది.

# సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎండీ నుంచి లిఖితపూర్వక హామీ



విశ్వంభర, అమరావతి: గత రెండు నెలల కుపైగా రాష్ట్రంలో ఆర్టీసీ జేఏసీ ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి వారు తలపెట్టిన నిరసనలు వాయిదా వేస్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఆర్టీసీ జేఏసీ ఎలక్ట్రిక్? బస్సుల వ్యవహారం, నియామకాలు, సహా పలు సమస్యలతో యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పలు మార్లు సంబంధిత అధికారులతో చర్చలు జరిగి విఫలమవగా, కొన్ని మీటింగ్‌లలో వివిధ సమస్యలకు పరిష్కారం దక్కింది. కానీ తమ డిమాండ్లు పూర్తిస్థాయిలో ఫలించలేదని ఆర్టీసీ ఐకాస నిరసన కొనసాగించింది. ఇప్పటికే వారు తమ డిమాండ్లపై ఆర్టీసీ ఎండీతో 5 సార్లు సమావేశమైనట్లు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ బస్సుల అంశంపై సానుకూల నిర్ణయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నియామకాల విషయంలో తమకు నమ్మకం కలిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎండీ నుంచి లిఖితపూర్వక హామీ వచ్చిందని జేఏసీ సభ్యుడు దామోదర్ వివరించారు. హామీ ఇచ్చిన వాటిపై సర్క్యులర్ ఇస్తామని ఎండీ భరోసా ఇచ్చారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం కొత్త జిల్లా కేంద్రాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారని దామోదర్ తెలిపారు. విశాఖలో 20 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనలో ఏపీ జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. ఈ మేరకు వారి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తుంది. గతంలో జరిగిన చర్చల్లో ఆర్టీసీలో విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టడంవల్ల వచ్చే సమస్యలు, ఇబ్బందులు అధిగమించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తామని సంస్థ ఎండీ బాలసుబ్రహ్మణ్యం గత నెలలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేయగా, ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులతో చర్చలు సానుకూలంగా జరిగాయని జులై నెలలోనే తెలిపారు.

## ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు



విశ్వంభర, అమరావతి: కడప జిల్లా వేంపల్లి మండలంలో ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. డీఎస్సీపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేసిన ప్రతినిధి బృందంలో ముగ్గురు టీచర్లు ఉన్నారు. వారిని ఎస్జీటీలుగా పని చేస్తున్న సంగమేశ్వరరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, వెంకటనాథరెడ్డిగా గుర్తించారు. సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ముగ్గురిపై వేటు వేశారు.

## డ్వాక్రా మహిళలకు రూ.3లక్షల చొప్పున స్త్రీనిధి రుణం

: మంత్రి కొండపల్లి



విశ్వంభర, అమరావతి: డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌తో అనుసంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ పథకంలో అర్హత కలిగిన డ్వాక్రా మహిళలు రూ.3లక్షల వరకు యూనిట్ వ్యయంతో ఆహార శుద్ధి యూనిట్లను స్త్రీనిధి రుణం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకంలో మహిళలు పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, చిరుధాన్యాలు, పప్పులు, మసాలాలు, పచ్చళ్లు, పిండి పదార్థాలు, స్నాక్స్ వంటి ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రతి జిల్లాలోని జిల్లా సమాఖ్యలను డిస్ట్రిక్ట్ రిసోర్స్ ఆర్గనైజేషన్స్‌గా పరిగణించి వారి ద్వారా ఆసక్తి, సామర్థ్యం ఉన్న డ్వాక్రా మహిళలను గుర్తించడం జరుగుతుందన్నారు.

## 'ముడా' తరహాలోనే టెస్సెరాక్ట్ భూ కుంభకోణం

రేవంత్ రెడ్డి కుటుంబంపై లోకాయుక్తలో బీఆర్ఎస్ ఫిర్యాదు



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కేటాయించారంటూ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డిలతో కూడిన బృందం శుక్రవారం లోకాయుక్తను ఆశ్రయించి ఫిర్యాదు అందజేశారు. సీఎం సోదరుడు కొండల్ రెడ్డి 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా విలువైన భూముల కేటాయింపు చేశారని రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకు ధారాదత్తం చేశారని అందువల్ల టెస్సెరాక్ట్ భూ కేటాయింపులను వెంటనే రద్దు చేసి, ఇందులో సీఎం రేవంత్ రెడ్డి పాత్రపై విచారణ కోసం నివేదికను గవర్నర్‌కు పంపాలని డిమాండ్ చేశారు. లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ కర్ణాటక 'ముడా' తరహాలోనే తెలంగాణలో టెస్సెరాక్ట్ భూ కుంభకోణం సాగిందని ఆరోపించారు. ఏరోస్పేస్ కంపెనీ అని చెప్పుకుంటున్న టెస్సెరాక్ట్ చెల్లించిన మూలధనం కేవలం రూ. 1 లక్ష మాత్రమేనని ఈ కంపెనీ అధికారిక బోర్డు నివేదిక ప్రకారం కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 'సున్నా' అని ఆరోపించారు. నివాస ఫ్లాట్ అడ్రస్‌తో నడుస్తున్న కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన డిఫెన్స్ భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. యూరోపియన్ యూనియన్ ఆడిట్ సైట్ నుంచి ఫోటోలు దొంగిలించి ప్రదర్శించారని ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తమ ఫిర్యాదులో ప్రతివాదులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏ1 గా, ఏ2 గా మంత్రి శ్రీధర్ బాబు, టీజీఐఐసీ అధికారులుగా పేర్కొంటూ ఫిర్యాదు చేశామన్నారు. వీరిపై అవినీతి నిరోధక చట్టం, బీఎన్ఎస్ సెక్షన్ల కింద విచారణకు బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. వెబ్‌సైట్‌లో ఫేక్ నంబర్ పెట్టి కేటీఆర్ నిలదీయడంతో రాత్రికి రాత్రే మార్చేశారని సీఎం సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్‌గా, సీఎం మేనల్లుడు నయన్ రెడ్డి సీఈవోగా ఉన్నారని ఆధారాలు సమర్పించినట్లు చెప్పారు. ఈ భూ కేటాయింపులకు 5 నెలల ముందే సీఎం మేనల్లుడు టెస్సెరాక్ట్ సీఈవోగా బాధ్యతలు తీసుకున్నారని అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు అబద్ధాలు చెబితే, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ భూ కేటాయింపులను స్వయంగా ఒప్పుకున్నారని ఆరోపించారు. రికార్డుల్లో కొండల్ రెడ్డి పేరు లేకుండా బినామీలను పెట్టారు.. ఇది పక్కా బినామీ వ్యవహారం అని ఆరోపించారు.

## కిడ్నీ రాకెట్ కేసుపై నిర్లక్ష్యం

అన్నమయ్య డీఎంహెచ్‌వోపై సస్పెన్షన్ వేటు




విశ్వంభర, అన్నమయ్య: మదనపల్లెలో వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసు వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభియోగాలపై అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనరసయ్యను ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.వీరపాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు. కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి ఆధారాలు లేవంటూ తప్పుదోవ పట్టించేలా నివేదిక ఇచ్చారని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆస్పత్రి లైసెన్స్ సస్పెండ్ చేయడంతోనే తన పాలనా చర్యలను పరిమితం చేశారని, అనంతరం స్వాధీనం ప్రక్రియ సందర్భంగా కేసులోని వాస్తవాలను హైకోర్టుకు తెలియజేయడంలోనూ విఫలమయ్యారని ప్రభుత్వం పేర్కొంది. డీఎంహెచ్‌వోపై శాఖాపరమైన విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖపట్నానికి చెందిన యమున (29)కు మదనపల్లె గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అక్రమంగా కిడ్నీ తొలగించే ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత తీవ్రనొప్పితో 2025 నవంబరు 10న తెల్లవారుజామున ఆమె మరణించారు. విషయం బయటకు రాకుండా ఉండేందుకు ఆసుపత్రి సిబ్బంది, దళారులు కలిసి ఆమె మృతదేహాన్ని రహస్యంగా తిరుపతికి తరలించారు. యమునతో పరిచయం ఉన్న సూరిబాబు అనే వ్యక్తికి దళారులు మొదట ఇస్తామన్న రూ.6 లక్షల డబ్బు ఇవ్వకపోవడం, ఆమె మరణించడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్పట్లో ఘటన వెలుగులోకి వచ్చింది.

## పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్



విశ్వంభర, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు సామాజిక సంస్కరణలు, మహిళా విద్య, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ అన్నారు. ఖైరతాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో పూలే దంపతుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ పూలే దంపతుల ఆశయాల స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం బీసీలతో పాటు అన్ని వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్య, ఉపాధి, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం అందరికీ దక్కేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించి, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

## పేపరు లీకుల్లో వైఎస్ కుటుంబం దిట్ట: ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



విశ్వంభర, కడప: పేపరు లీకుల్లో వైఎస్ కుటుంబం దిట్ట అని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విమర్శించారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో డీఎస్సీ పరీక్షా జవాబు పత్రాలను నంద్యాల, కర్నూలు లాడ్జిల్లో దిద్దారని ఆక్షేపించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరగడంతో సుమారు 168 మంది ప్రస్తుతం ప్రాధాన్యం లేని ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. కడప ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు."కడప జడ్పీలో కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే 25 మంది నకిలీ కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొంది ఇప్పుడు రోడ్డున పడ్డారు. ఇద్దరు ఉద్యోగులను అరెస్టు చేశారు. గతంలో గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో భారీ అక్రమాలు జరిగాయి. ఒక్కో అభ్యర్థి నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారు. గ్రూప్-1 పరీక్షా పత్రాలను ఎలాంటి అనుభవం లేని వారితో మూల్యాంకనం చేయించారు. ప్రొఫెసర్లకు బదులు ప్రైవేటు ఉద్యోగులు, భద్రతా సిబ్బంది, క్లర్కులు, గృహిణులచే గ్రూప్-1 జవాబు పత్రాలను దిద్దించారు" అని రాంగోపాల్‌రెడ్డి అన్నారు.

## అధునాతన అగ్నిమాపక వాహనాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు



విశ్వంభర, అమరావతి: రాష్ట్ర అగ్నిమాపకశాఖలోకి మరికొన్ని ఆధునిక వాహనాలు రానున్నాయి. తాజాగా 58 ఆధునిక ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు.. 20 వాటర్ బౌజర్లు.. 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలను లాంచ్ చేశారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 25 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలను అగ్నిమాపక శాఖ సమకూర్చుకుంది. భారీ అగ్నిప్రమాదాల్లో మంటలను అదుపు చేయడానికి అవసరమయ్యే నిరంతర నీటి సరఫరాకు 20 వాటర్ బౌజర్లు కొనుగోలు చేసింది. ఇరుకైన, రద్దీ ప్రాంతాల్లోకి వేగంగా చేరుకునేలా 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలు పనిచేస్తాయి. తొలి దశలో ఇప్పటికే రూ.33 కోట్లతో 65 ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వాహనాల ప్రత్యేకతలను అధికారులు సీఎంకు వివరించారు. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు.. చంద్రగిరిలో భగ్గుమన్న టీచర్లు



విశ్వంభర, చంద్రగిరి: మెగా డీఎస్సీపై వైకాపా ఆరోపణలు చేయడంపై టీచర్లు భగ్గుమన్నారు. పులివర్తి వినీల్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా చంద్రగిరిలోని నూర్ జంక్షన్ నుంచి క్లాక్ టవర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మా కష్టం, మా ప్రతిభ అవమానిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వేలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులు, యువత ప్లకార్డులు ప్రదర్శిస్తూ వైకాపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## విజయవాడ దుర్గాఘాట్ వద్ద వరుణయాగం



విశ్వంభర, విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, సమృద్ధిగా వానలు కురవాలని ఆకాంక్షిస్తూ విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6.15 గంటలకు కృష్ణానది తీరంలోని దుర్గా స్నానఘాట్‌లో విఘ్నేశ్వర పూజతో యాగ క్రతువు మొదలైంది. పండితులు కృష్ణానదిలో నడుము లోతు నీటిలో నిలబడి వరుణ అనువాక సహిత కారక పారాయణం చేశారు. అనంతరం పాత యాగశాల వద్ద అఖండ దీపారాధన, మండపారాధన తదితర వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ పాల్గొన్నారు.

## మంచిని చెడుగా చూపడమే వైసీపీ నైజం: ఎమ్మెల్యే యరపతినేని



విశ్వంభర, గుంటూరు: డీఎస్సీలో అక్రమాలు జరిగాయని నానాయాగీ చేసి.. మంచిని చెడుగా చూపడమే వైకాపా నైజమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా ఇప్పటి వరకూ 1.96లక్షల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలిచ్చారని తెలిపారు. ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా, ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకుండా వైకాపా ఈ విషయంపై మాట్లాడటం నిరుద్యోగుల్లో అనుమానాలు రేకెత్తించటమేనని అభిప్రాయపడ్డారు. 1994లో కాంగ్రెస్‌కు 26 సీట్లు వచ్చినా ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారని, 2019లో తెదేపాకు 23 వచ్చినా ప్రజల కోసం శాసనసభలో మాట్లాడామని గుర్తు చేశారు. జగన్ మాత్రం.. అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారాని ఎద్దేవా చేశారు. చంద్రబాబుని అసెంబ్లీలో అవమానించినా తట్టుకుని ప్రజల కోసం ఉన్నారని తెలిపారు. తాము వస్తే రప్పా రప్పా అంటూ వైకాపా నేతలు డైలాగులు చెబుతున్నారని... వాళ్లు మళ్లీ వచ్చేది లేదన్నారు. ఆ పార్టీ ఓ జాతీయ పార్టీలో విలీనం కావటం ఖాయమని వ్యాఖ్యానించారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిపై విషం చిమ్మటం, ఉత్తరాంధ్ర రాయలసీమల్లో పరిశ్రమలు వస్తుంటే అడ్డుకోవటం... ఇవన్నీ చూశాక జనం వైకాపాకు ఎందుకు ఓట్లు వేస్తారని ప్రశ్నించారు.

## పల్నాడు జిల్లాలో వైసీపీ నేత హత్య కేసులో నిందితుల అరెస్ట్

విశ్వంభర, గురజాల: పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకు చెందిన వైకాపా నేత నవులూరి చెన్నారెడ్డి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దాచేపల్లి-మాచర్ల క్రాస్‌రోడ్డులో నిందితులు అశోక్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, పేరిరెడ్డితో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. వారి నుంచి వాహనం, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టుకు తరలించగా.. న్యాయస్థానం రిమాండ్ విధించింది. రాజకీయ ఆధిపత్య పోరులో భాగంగానే చెన్నారెడ్డిని ప్రత్యర్థులు హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి సభకు సర్వం సిద్ధం

### సంగారెడ్డిలో ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి



విశ్వంభర, సంగారెడ్డి: సంగారెడ్డిలో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభను లక్ష మంది తో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఈ సందర్భముగా సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం బహిరంగ సభను లక్ష మంది తో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతం కోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీల విగ్రహాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు. సీఎం సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచే సుమారు 50 వేల మంది హాజరవుతారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చిందని విమర్శించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టి రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి అందించనుందని తెలిపారు. సభకు వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని జగ్గారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలోకి దుబ్బాక రామయ్య



విశ్వంభర, మణుగూరు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ వైకే వర్గానికి చెందిన అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రామయ్య (జగ్గన్న), ఆయన సతీమణి ప్రమీలక్కలు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కామ్రేడ్ పెద్ద చంద్రన్న పార్టీలో చేరినట్లు ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం--ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్ తెలిపారు. మణుగూరులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకుడు సింగనబోయిన రామన్న ఆధ్వర్యంలో వారిని పార్టీలోకి ఆహ్వానించి చేర్చుకున్నట్లు చెప్పారు. దుబ్బాక రామయ్య సుమారు 50 ఏళ్లుగా విప్లవ ఉద్యమంలో పనిచేస్తున్నారని, గతంలో జనశక్తి పార్టీలో దళ కమాండర్‌గా, అనంతరం అఖిలభారత రైతు కూలీ సంఘంలో జిల్లా కమిటీ నాయకుడిగా పనిచేశారని తెలిపారు. వైకే వర్గం విధానాలు నచ్చకనే పెద్ద చంద్రన్న నాయకత్వంలోని న్యూడెమోక్రసీలో చేరినట్లు రామయ్య పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో దున్నేవారికే భూమి దక్కాలనే లక్ష్యంతో ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శిస్తూ వాటికి వ్యతిరేకంగా పోరాటాలను బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వీరమళ్ల ఉమా, రాష్ట్ర నాయకురాలు శారు కవిత తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్‌బండ్ పై తిరంగా ర్యాలీ





విశ్వంభర, హైదరాబాదు : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన తిరంగా ర్యాలీకి భారీ స్పందన లభించింది. అశేషంగా తరలివచ్చిన ప్రజలతో పాటు త్రివర్ణ పతాకాలు చేతబట్టి యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో జాతీయ జెండాలతో ట్యాంక్‌బండ్ మొత్తం త్రివర్ణ శోభను సంతరించుకుంది. దేశభక్తి నినాదాలతో పాల్గొన్న ప్రజలు భారత స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దేశ సమగ్రత, జాతీయ ఐక్యతను కాపాడాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమర చరిత్రను యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ర్యాలీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎన్ గౌతమ్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 210 షాపులతో ఉప్పల్‌లో పి హెచ్ టి మార్కెట్

### ఆగస్టు 16న ప్రారంభోత్సవం



విశ్వంభర, ఉప్పల్: ఉత్పత్తిదారులు, ముఖ్యంగా చేనేత, వస్త్ర రంగానికి చెందిన తయారీదారులు, తమ ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా అందించాలనే లక్ష్యంతో ఉప్పల్‌లో పిహెచ్ టి మార్కెట్ పేరుతో 210 షాపులతో కూడిన ప్రత్యేక షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసినట్లు మేనేజింగ్ పార్ట్‌నర్స్ గడ్డం వెంకటేష్, గుజ్జ సత్యం, వనం నరసింహ, గోషిక కృష్ణ లు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మేనేజింగ్ పార్ట్‌నర్స్ గడ్డం వెంకటేష్, గుజ్జ సత్యం లు మాట్లాడుతూ మధ్యవర్తుల వ్యవస్థను తగ్గించి, ఉత్పత్తిదారుల నుంచే నేరుగా వినియోగదారులకు వస్త్రాలు అందుబాటులోకి తీసుకురావడం తమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఒకే ప్రాంగణంలో వివిధ రకాల వస్త్రాలు, చేనేత ఉత్పత్తులు, మహిళలు, పురుషులు, చిన్నారులకు సంబంధించిన వస్త్రాలు, ఫ్యాషన్ జ్యువెలరీ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా మాల్‌ను రూపొందించినట్లు చెప్పారు.

## వికలాంగుల హామీలు అమలు చేయాలి

### కొడంగల్‌లో అరటి తొక్కలు తింటూ వినూత్న నిరసన



విశ్వంభర, కొడంగల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కొడంగల్‌లో వినూత్న నిరసన చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు అరటి తొక్కలు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిద్దె రాజేష్ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచడం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, వికలాంగుల హక్కుల చట్టాల అమలు వంటి హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నాటికైనా హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, కొడంగల్‌లో లక్ష మందితో 'వికలాంగుల ఆవేదన సభ' నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని గిద్దె రాజేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పోలీసు అధికారులకు సేవా పతకాలు



విశ్వంభర, హైదరాబాదు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంశాఖ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక సేవా పతకాలకు హైదరాబాద్ నగర పోలీసు శాఖకు చెందిన ఇద్దరు అధికారులు ఎంపికయ్యారు. రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి సికింద్రాబాద్ జోన్ అదనపు డీసీపీ జే. నర్సయ్య, విశిష్ట సేవా పతకానికి సైబర్ క్రైమ్ ఏసీపీ ఆర్.జీ. శివమారుతి ఎంపికయ్యారు. శుక్రవారం సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనర్ వారిని ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకే ఈ పురస్కారాలు లభించాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ ఎం. శ్రీనివాస్, జాయింట్ సీపీ ఎస్.ఎం. విజయ్‌కుమార్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొని పతక గ్రహీతలను అభినందించారు.

# శివానీ ఉమెన్స్ కాలేజీలో ఘనంగా గంగ బోనాల ఉత్సవాలు



విశ్వంభర, సరూర్ నగర్ :కోతపేట లోని శివానీ ఉమెన్స్ కాలేజీ లో బోనాల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంకు ముఖ్య అతిథులు కళాశాల చైర్మన్ డా. పల్లె రామ్ రెడ్డి, కరస్పాండెంట్ వెదిరె సుధర్శన్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండగ అని అన్నారు. బోనం తెలంగాణ ప్రజల ప్రాణమని తెలిపారు. విద్యార్థినులు బోనాలు, పోతరాజుల వేషధారణలు, సాంప్రదాయ నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. అనంతరం కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి ఖిల్లా మైసమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థినుల నృత్యాలు, కళారూపాలు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, విద్యార్థినులు తెలంగాణలో విద్యారంగం మరింత అభివృద్ధి చెందాలని, విద్యార్థినులకు మెరుగైన విద్యా అవకాశాలు లభించాలని ఖిల్లా మైసమ్మ అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. అనిత, అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 1,000 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



విశ్వంభర, నాగోల్ : యువతి అదృశ్యమైన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగోల్ లో నివాసముండే సాయి ప్రియ (21) ఓ సూపర్ మార్కెట్లో జాబ్ చేస్తున్నది. ఈనెల 13వ తేదీన డ్యూటీ కి అని చెప్పి ఇంట్లో నుండి వెళ్ళింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకడం, బంధువులు , స్నేహితులను ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో నాగోల్ పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆమె అదృశ్యం విషయంలో ప్రభు అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు. పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డివిజన్‌లో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని వినతి



విశ్వంభర, గడ్డి అన్నారం : గడ్డి అన్నారం డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు , మ్యాన్‌హోళ్ల శిథిలావస్థను పరిష్కరించాలని గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దెల సునీల్ బాబు ఆధ్వర్యంలో హెచ్ఎమ్ డబ్ల్యూ ఎస్ మేనేజింగ్ డైరెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల తాగునీటి , భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని గడ్డి అన్నారం డివిజన్‌కు ప్రత్యేకంగా ఒక రిజర్వాయర్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల గడ్డి అన్నారం డివిజన్‌తో పాటు చైతన్యపురి తదితర సమీప డివిజన్లకు కూడా మంచినీటి సరఫరా మెరుగుపడుతుంది. నూతన మంచినీటి పైప్‌లైన్ డివిజన్‌లోని అన్ని కాలనీలకు నిరంతరాయంగా , సమృద్ధిగా మంచినీరు అందించేందుకు నూతన మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై.వి. కృష్ణారెడ్డి , నాగ మహేష్ , మర్రి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ నిషేధిత జాబితాలో భూముల చేరికపై ఈటల ఆగ్రహం



విశ్వంభర, మేడ్చల్ : గతంలో అన్ని అనుమతులు పొంది, బ్యాంకు రుణాలతో ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు, బ్రోకర్లు కుమ్మక్కై ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం కంటోన్మెంట్ లోని డైమండ్ పాయింట్ గాయత్రీ గార్డెన్స్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈటల మాట్లాడుతూ.. ఏళ్ల క్రితమే భూములు కొనుగోలు చేసి, అన్ని అనుమతులు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్న వారు ప్రస్తుతం ఆ భూములు తమవేనని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు బ్రోకర్లు, అధికారులు భూమి లేదా విలువలో 40 శాతం వరకు డిమాండ్ చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారుగతంలో కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్, రంగారెడ్డి భూములను తన గుప్పిట్లో పెట్టుకుందని విమర్శించిన ఈటల.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంగారెడ్డి, మెదక్, భువనగిరి, సిద్దిపేట, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని భూములపై పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లకుండా కీలక భూ వ్యవహారాలపై ఫైళ్లకు సంతకాలు చేయొద్దని కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనన్నారు. గతంలో ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని, అప్పటి కలెక్టర్లు అమోయ్ కుమార్, హరీశ్ లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారని గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు ఆ హామీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రభుత్వం వెల్లడించాలని ఈటల డిమాండ్ చేశారు. ధరణిలోని లోపాలను సరిదిద్దకుండా వేల ఎకరాల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు కోర్టుల్లో తప్పుడు అఫిడవిట్లు సమర్పించి భూకబ్జాదారులు గెలిచేలా సహకరిస్తున్నారని ఈటల ఆరోపించారు. కూకట్‌పల్లిలో ఫినిక్స్ సంస్థకు గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల విలువైన భూములను అప్పగించిందని, ప్రస్తుతం అక్కడ హానర్ హోమ్స్ పేరుతో నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు కోర్టుల్లో సమర్పించిన అఫిడవిట్లపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. శంషీగూడ, ఎల్లమ్మబండలో ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నించగా తాను 2006 నుంచి పోరాడుతున్నానని తెలిపారు. 2022లో ప్రభుత్వ యంత్రాంగం భూకబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించినట్లు తెలుస్తోందన్నారు. సర్వే నంబర్ 57లో 150 ఎకరాలను జర్నలిస్టులు, పేదలకు పట్టాలు ఇచ్చినప్పుడు అదే సర్వే నంబర్‌లో 100 ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల భూమిగా ఎలా మారిందని ప్రశ్నించారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంతటి దుర్మార్గమైన, బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని చూడలేదని ఈటల వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేస్తున్న భూ అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలపై బీజేపీ ప్రజల తరఫున పోరాడుతుందని అన్నారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రం అధిక నిధులు సమకూరుస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రి ఫొటోలు ముద్రించడం సరికాదని ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అధికంగా బియ్యం అందిస్తున్న నేపథ్యంలో రేషన్ కార్డులపై ప్రధాని, కేంద్ర మంత్రుల ఫొటోలు లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి ఫొటోలు మాత్రమే ముద్రించడం ఏమిటని ప్రశ్నించారు. స్మార్ట్ రేషన్ కార్డుల కోసం రూ.600 కోట్లు ఖర్చు చేస్తున్నారని, రెండేళ్ల తర్వాత ప్రభుత్వం మారితే మళ్లీ కొత్త కార్డుల కోసం ప్రజాధనం ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. రేషన్ కార్డులపై వ్యక్తుల ఫొటోలు కాకుండా 'భారత ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో' అనే వివరాలు మాత్రమే ఉండేలా కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

## వెంకటేశ్వర కాలనీలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

విశ్వంభర, సరూర్ నగర్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు లి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా శ్రీ వెంకటేశ్వర కాలనీలో రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కాలనీలోని 17 రోడ్లలో లయోలా హై స్కూల్, నావి హై స్కూల్, సాగరిక హై స్కూల్ లకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని అత్యంత ఉత్సాహంతో భరత్ మాతాకీ జై, వందేమాతరం అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు. ప్రతి ఇంట వందేమాతరం నినాదాలతో ప్రతి ఇంటిపై మన జాతీయ జెండాను ఉంచుకోవాలని ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గండు ధనం రెడ్డి, ఉపాధ్యక్షులు మునగాల నరేష్, ప్రధాన కార్యదర్శి పి.వి.ఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి సోమ వెంకట్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వార్త శ్రీనివాస్, సలహాదారులు తులసి కృష్ణమూర్తి, బిజ్జల కనకారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సురేందర్ రాజు, సోమ ప్రవీణ్, శ్రీనివాస్ కార్తీక్, వెంకటేశ్వర కాలనీ దేవాలయ వైస్ చైర్మన్ శాంతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు చేరిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



విశ్వంభర, హైదరాబాద్: బీసీ సంక్షేమానికి రూ.12,511 కోట్లు కేటాయించామని ప్రభుత్వం ప్రకటించడం మాత్రమే సరిపోదని.. ఆ నిధుల్లో ఇప్పటివరకు ఎంత విడుదల చేశారు? ఎంత ఖర్చు చేశారు? ఎంతమంది బీసీలకు ప్రయోజనం చేకూరింది? ఇంకా ఎంత మొత్తం పెండింగ్‌లో ఉంది? అనే పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ బడ్జెట్‌పై ప్రభుత్వం వెంటనే 'బీసీ బడ్జెట్ శ్వేతపత్రం' విడుదల చేయాలని కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ఒక ప్రక్రియ మాత్రమేనని.. అవి విడుదలై, ఖర్చయి, అర్హులైన బీసీలకు చేరినప్పుడే సంక్షేమానికి అర్థం ఉంటుందని అన్నారు. కేటాయింపులకు.. ఖర్చుకు పొంతనేది అని అన్నారు. బడ్జెట్ పుస్తకాల్లో భారీ కేటాయింపులు చూపించి.. క్షేత్రస్థాయిలో నిధులు అందకపోతే బీసీలకు ప్రయోజనం ఏమిటని నిలదీశారు. కేటాయింపు నుంచి ఖర్చు వరకు ప్రతి రూపాయి లెక్క ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రత్యేక బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి అని అన్నారు.

## అక్షర జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే




విశ్వంభర, వనస్థలిపురం : బి.ఎన్.రెడ్డి నగర్‌లోని అక్షర జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఈదులకంటి రామిరెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కు డైరెక్టర్లు లవ కుమార్ , నరేష్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , నరసింహ , శ్రీశైలం కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని సాధించవచ్చని తెలిపారు. ఫ్రెషర్స్‌ను ఆత్మీయంగా స్వాగతిస్తూ, వారి కళాశాల జీవితం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. సందర్భంగా విద్యార్థులలో ఉత్సాహాన్ని, స్నేహభావాన్ని పెంపొందించే విధంగా పలు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ఎర్లీ మార్నింగ్ 4గంటలకు నన్ను ఎవరో ఎత్తుకోడానికి ట్రై చేశారు



ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న బీటౌన్ బ్యూటీ సోనాక్షి సిన్హా.. తన ఇంట్లో జరిగిన ఒక వింత సంఘటన, దెయ్యాలపై తనకున్న నమ్మకాన్ని వెల్లడించింది. సోనాక్షి నటించిన మిస్టరీ హారర్-థ్రిల్లర్ సినిమా 'నికితా రాయ్' అనుభవాలతో పాటు హారర్ జానర్‌తో తనకున్న అనుబంధం గురించి మాట్లాడుతూ.. 'మీకు తెలుసా, ఈ దెయ్యాలు, ఆత్మలు, అతీంద్రీయ శక్తులను నేను మొదట్లో అస్సలు నమ్మేదాన్ని కాదు. కానీ ఒకరోజు నా సొంత ఇంట్లోనే నాకు చాలా విచిత్రమైన సంఘటన జరిగింది. పూర్తిగా నిద్రపోకుండా, మెలకువగా ఉన్నట్లు అనిపించే స్థితిలో ఉన్నా టైమ్‌లో అకస్మాత్తుగా ఎవరో నన్ను పైకి ఎత్తుతున్నట్లుగా ఒక చిన్న ఒత్తిడిని అనుభవించాను. అప్పుడు దాదాపు తెల్లవారుజామున 4 గంటల సమయం ఉంటుంది. సగం, సగం నిద్రలో ఉండటంతో అది కలనా లేక నిజమా అని నాకు అర్థం కాలేదు. ఆ క్షణంలో నాకు ప్రాణం పోయినంత పనైంది. భయంతో నేను కళ్లు కూడా తెరవలేదు. అక్కడ ఎవరైనా ఉన్నారో లేదో చూసే ధైర్యం కూడా చేయలేకపోయాను. ఇక తెల్లవారగానే అక్కడ నుంచి పరుగు తీశాను. అయితే.. మరుసటి రాత్రి కూడా ఇంటికి వెళ్లేసరికి లేట్ అయింది. ఆ టైమ్‌లో నేను డోర్ నెమ్మదిగా తీసి.. లోపల ఎవరైనా ఉన్నారా? ఒకవేళ ఉంటే నిన్నటి రాత్రిలాగా తిరిగి రావద్దు. నేను చాలా భయపడ్డాను. ఏదైనా ఉంటే నా కలల్లోకి రా.. ముఖాముఖిగా కూర్చుని మాట్లాడు. ఇవన్నీ చేయకు' అని గట్టిగా మాట్లాడి లోపలికి నడిచి వెళ్లాను. ప్రమాణం చేసి చెబుతున్నా ఆ తర్వాత మళ్లీ అలా ఏమీ జరగలేదు' అంటూ చెప్పుకొచ్చింది.



## 'ఫర్జీ 2' షూటింగ్ అప్డేట్ పంచుకున్న రాశీ ఖన్నా

షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ఫర్జీ-2'. ఇందులో రాశీ ఖన్నా ఆర్బీఐ అధికారి 'మేఘా వ్యాస్'గా మళ్లీ తెరపై కనిపించనుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా షూటింగ్ అప్డేట్‌ను పంచుకుంది రాశి. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ వేదిక షూటింగ్ సెట్స్, క్యారవాన్ నుంచి కొన్ని ఫొటోలను షేర్ చేస్తూ.. 'ఫర్జీ-2' షూటింగ్‌లో జాయిన్ అయినట్లు తెలిపింది. 'ఆల్మండ్ మిల్క్‌తో కూడిన 'క్రంచీ రెడ్ హాట్ మోచా గ్రాండే' ఎవరి కోసం..?' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ పిక్స్ అభిమానులను ఆకర్షిస్తున్నాయి. కాగా.. 2023లో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సిరీస్ 'ఫర్జీ'. ఈ సిరీస్ ఎనిమిది భాగాలుగా అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలై, ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ప్రముఖ చిత్రనిర్మాతల ద్వయం రాజ్ & డికె రూపొందించిన మొదటి భాగంలో షాహిద్, రాశీ, విజయ్ సేతుపతి, కే కే మీనన్, భువన్ అరోరా, రెజీనా కసాండ్ర, అమోల్ పాలేకర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పుడు ఈ బ్లాక్ బస్టర్ 'ఫర్జీ'కు సీక్వెల్‌గా ఫర్జీ-2 రాబోతుండగా.. భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సీక్వెల్‌కు కూడా రాజ్ & డికె రూపొందిస్తున్నారు.






## శర్వానంద్ - శ్రీను వైట్ల సినిమా షురూ..

హీరో శర్వానంద్, ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రానుంది. ఈ సినిమా నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టగా.. ప్రముఖ నిర్మాత సురేశ్ బాబు కెమెరా స్విచ్ చేశారు. ఇక ఈ చిత్రానికి 'జార్జ్ క్రిష్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర, అజయ్ సుంకర నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న దీన్ని విడుదల చేయనున్నట్లు టీమ్ పేర్కొంది. ప్రస్తుతం శర్వానంద్ 'భోగి'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. సంపత్ నంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆగస్టు 28న విడుదల కానుంది. ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు. శర్వాకు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. 'కందుల సులోచన రాణి'గా అనుపమ కనిపించనుండగా.. మందారం అనే బోల్డ్ పాత్రలో డింపుల్ నటిస్తున్నారు.









## నా మొబైల్ పాస్వర్డ్ వారానికి ఒకసారి మారుస్తా..

టీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున తాజాగా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. సైబర్ మోసాల నుంచి రక్షించు కోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా పలు సూచనలు చేశారు. తాజాగా సైబర్ క్రైమ్ గురించి మాట్లాడుతూ.. ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, లేదంటే పెద్ద మొత్తంలో మూల్యం చెల్లించాల్సి వస్తుందని నాగార్జున అన్నారు. తన బంధువుల్లో ఒకరికి 'మీ పార్సెల్‌లో డ్రగ్స్ ఉన్నాయి' అంటూ ఫోన్ కాల్స్ వచ్చాయని, అలాగే వారిని ఆరు, ఏడు గంటల పాటు ఇంటికే పరిమితం అయ్యేలా చేశారని చెప్పారు. అయితే వారు సమయస్ఫూర్తితో సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని వెల్లడించారు. తాను కూడా సైబర్ క్రైమ్ బారిన పడకుండా ఉండేందుకు దాదాపు వారానికి ఒకసారి సెల్‌ఫోన్ పాస్‌వర్డ్‌ను మారుస్తానని, అలాగే నెలకు ఒకసారి క్రమం తప్పకుండా వైఫై పాస్‌వర్డ్‌ను కూడా మారుస్తుంటానని చెప్పారు. ఇలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉండటం వల్ల ఇప్పటివరకు సైబర్ క్రైమ్ బారిన పడలేదని, ప్రజలు కూడా తమకు తోచిన విధంగా ఎంతో కొంత అప్రమత్తంగా ఉండాలని నాగార్జున సూచించారు.










Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com